విస్తరణ దిశగా విమానాశ్రయం

- మరిన్ని నగరాలకు విమానాలు
- అంతర్జాతీయ సర్వీసులకోసం రన్‌వే విస్తరణ పనులు పూర్తి


విమానాశ్రయ డైరెక్టర్ శ్రీనివాసరావు


ఏటీసీ బిల్డింగ్ నిర్మాణం

రేణిగుంట, ఆగస్టు 21: తిరుపతి విమానాశ్రయం నుంచి దేశంలోని పలు నగరాలకు విమాన సర్వీసులు త్వరలో విస్తరించనున్నాయి. రేణిగుంటలోని విమానాశ్రయం నుంచి వారంలో నాలుగు రోజులు 14, మిగిలిన 3 రోజులు 13 విమాన సర్వీసులు విశాఖపట్టణం, హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, బెల్గామ్, ఢిల్లీ నగరాల నుంచి నడుస్తున్నాయి.ఈ నేపథ్యంలో ఇక్కడినుంచి ముంబై, అహ్మదాబాద్, కోల్‌కత్తా, అలహాబాద్, మధురై, తిరుచ్చి, తిరువనంతపురం విమానాశ్రయాల నుంచి సర్వీసులు నడిపేందుకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదనల పట్ల సానుకూలంగా స్పందించిన పలు విమాన సంస్థలు తిరుపతికి విమాన సర్వీసులు పెంచనున్నాయి. అయితే ఈ సర్వీసులు తిరుపతికి నేరుగా కాకుండా కనెక్టింగ్ విమానాల ద్వారా నడిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. భవిష్యత్తులో ఈ సర్వీసుల ద్వారా ప్రయాణికులు పెరిగితే ఆయా నగరాల నంచి తిరుపతి విమానాశ్రయానికి నేరుగా సర్వీసులు నడిపేందుకు అవకాశం ఉంటుంది.ఈ విషయంపై ఎయిర్‌పోర్టు డైరెక్టర్ శ్రీనివాసరావును అడగ్గా దేశంలోని పలు ప్రధాన నగరాల నుంచి తిరుపతి విమానాశ్రయానికి సర్వీసులు నడిపేందుకు కొన్ని సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు. ఇప్పటికే అంతర్జాతీయ విమానాలు ల్యాండయ్యేందుకు రన్‌వే పనులు పూర్తయ్యాయని,ఢిల్లీలో వున్న డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజేసీఏ) పరిశీలించి అనుమతులు ఇవ్వడం కూడా జరిగిందన్నారు.రన్ వే మరింత విస్తరణ కోసం, ప్రత్యేక లైటింగ్ ఏర్పాట్లకు 11.11 ఎకరాలు అవసరం ఉండగా రాష్ట్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా సానుకూలంగా స్పందించిందన్నారు. త్వరలో భూమిని సర్వే చేసి విమానాశ్రయానికి అందజేయనున్నారని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ఏటీసీ బిల్డింగ్ పనులు రూ.47కోట్ల వ్యయంతో జరుగుతున్నాయని, గతంలో ఉన్న టవర్ కన్నా అధికంగా 18 మీటర్ల వెడల్పు కలిగిన ఏటీసీ టవర్‌ను నిర్మిస్తున్నామన్నారు.



తిరుమలలో మెగాస్టార్

సినీ హీరో చిరంజీవి బుధవారం సాయంత్రం తిరుమలకు వచ్చారు.గురువారం తన పుట్టినరోజు సందర్భంగా శ్రీవారి ఆశీస్సుల కోసం అమ్మ అంజనాదేవి, భార్య సురేఖ, కుమార్తె శ్రీజ, మనవరాలు నవిష్కలతో కలిసి కొండ పైకి చేరుకున్నారు.

ఆరుగురు డీఎస్పీల బదిలీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 21: ఆరుగురు డీఎస్పీలు బదిలీ అయ్యారు.నగరి డీఎస్పీగా పనిచేస్తున్న కె. నరసింహమూర్తిని శ్రీకాళహస్తికి, రాజమండ్రి స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ప్రభాకర్‌ను పలమనేరుకు, తిరుపతి ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేస్తున్న రమణకుమార్‌ను తిరుపతి క్రైం విభాగానికి, నెల్లూరు మహిళా స్టేషన్‌లో పనిచేస్తున్న టి. సాయినాథ్‌ను చిత్తూరుకు, కదిరిలో పనిచేస్తున్న ఎం.శ్రీలతను తిరుపతి మహిళా స్టేషన్‌కు డీజీపీ ద్వారకా తిరుమలరావు బదిలీ చేశారు. వీరందరూ తక్షణం పాత స్థానాల్లో రిలీవై కొత్త స్థానాల్లో బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు.

పంచాయతీల అభివృద్ధికి శ్రీకారం

- రేపు గ్రామ సభల నిర్వహణ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 21: గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. గ్రామ సభలు నిర్వహించి, ఉపాధి హామీ పథకం అనుసంధానంతో పనులు చేపట్టేందుకు అవసరమైన తీర్మానాలు చేసేందుకు నిర్ణయించింది. శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తారు. గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలపై చర్చిస్తారు.

మీరు లాకర్ తీసుకుని ఏడాది అవుతోంది!

- ఫైన్ కట్టండి... లేకుంటే ఆధార్ బ్లాక్ చేస్తాం
- భక్తులను బెదిరించి దోచుకుంటున్న అపరిచితుడు
- టీటీడీ విజిలెన్స్ విచారణతో వెలుగులోకి

తిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో సరికొత్త అక్రమం వెలుగు చూసింది. 'మీరు లాకర్ తీసుకుని దాదాపు ఏడాది అవుతోంది. మీరు ఖాళీ చేయకపోవడం వల్ల ఫైన్ పడింది. కట్టకుంటే మీ ఆధార్ కార్డును బ్లాక్ చేస్తాం' అంటూ ఓ యువకుడు శ్రీవారి భక్తులను బెదిరిస్తూ అందినకాడికి దోచుకుంటున్నాడు. తిరుమలలో బస చేసేందుకు గదులతో పాటు యాత్రికుల వసతి సముదాయాల్లో లాకర్లు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే.గదులు లభించని చాలామంది భక్తులు ఈ లాకర్లపైనే ఆధారపడుతుంటారు. లాకర్లలో లగేజీని భద్రపరుచుకుని దర్శనమయ్యాక తీసుకుని వెళ్లిపోతుంటారు. లాకర్ పొందే సమయంలో భక్తులు తమ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.ఇటీవల ఓ యువకుడు కొంతమంది భక్తులకు ఫోన్ చేసి వారు తిరుమలకు వచ్చిన తేదీ, లాకర్ తీసుకున్న ప్రాంతం, ఆధార్, సెల్‌నెంబరు చెబుతున్నాడు.ఇప్పటివరకు లాకర్ ఖాళీ చేయకపోవడంతో తమ ఆడిట్‌లో ఫైన్ పడిందని, ఆ సొమ్ము కట్టకపోతే ఇకపై దర్శనాలు, గదులు, లాకర్లు తీసుకునే వీల్లేకుండా ఆధార్ కార్డును బ్లాక్ చేస్తామని బెదిరిస్తున్నాడు.ఆధార్ బ్లాక్ అయిపోతే ఇబ్బంది పడతామన్న కొంతమంది భక్తులు ఆ యువకుడు డిమాండ్ చేసిన డబ్బును చెల్లించినట్టు తెలిసింది. ఇటీవల ఓ భక్తురాలికి ఫోన్ చేసి ఫైన్ కట్టాలని డిమాండ్ చేయడంతో ఆమె నగదు చెల్లించింది.ఆ పరిచయంతో తనకు దర్శనం కావాలని కోరగా చేయిస్తానని నమ్మించిన ఆ యువకుడు నగదు తీసుకుని తర్వాత చేతులెత్తేశాడు. దీంతో ఆ భక్తురాలు విజిలెన్స్‌ను ఆశ్రయించగా విచారణలో ఈ అక్రమం వెలుగు చూసింది. ఆ యువకుడు బెంగళూరులో ఉన్నట్టు గ్రహించిన టీటీడీ అధికారులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఆ భక్తుల వివరాలు అతడి వద్దకు ఎలా చేరాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

అపోలో వర్శిటీలో ఫుడ్ పాయిజన్



- 300మంది విద్యార్థులకు అస్వస్థత

చిత్తూరు రూరల్, ఆగస్టు 21: చిత్తూరులోని అపోలో యూనివర్శిటీలో సుమారు 300మంది విద్యార్థులు కలుషితాహారంతో అస్వస్థత పాలయ్యారు.అపోలో ఆస్పత్రిలో కొందరికి, చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో మరికొందరు విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారు. విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉండడంతో అపోలో యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది. ఎంబీబీఎస్, ఇంజనీరింగ్, నర్సింగ్, పారామెడికల్, ఆర్థో, ఫిజియోథెరపి విభాగాలకు చెందిన సుమారు 1200 మంది విద్యార్థులు చిత్తూరు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. మంగళవారం రాత్రి భోజనం చేసిన విద్యార్థుల్లో కొంత మందికి కళ్ళు తిరగడంతో పాటు జ్వరం, కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలు కావడంతో కళాశాలలోని మెడికల్ సెంటర్‌లో ఉంచి వైద్యం అందించారు. పరిస్థితి కాస్త విషమంగా ఉన్నవారిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఇలా సుమారు 90 మందికి పైగా విద్యార్థులు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. చిత్తూరులో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్యం నిలకడగా ఉందని డీఎంహెచ్‌వో ప్రభావతి తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఈ విషయం తెలిసి డీఎంహెచ్‌వో ప్రభావతికి ఫోన్ చేసి విద్యార్థుల పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పరామర్శించారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల నుంచి ర్యాపిడ్ రెస్పాన్స్ టీం గురువారం చిత్తూరు అపోలో కళాశాలను సందర్శించనుంది.విద్యార్థులతో మాట్లాడి అస్వస్థతకు కారణాలు తెలుసుకుని నివేదిక ఇవ్వనుంది.

ఇద్దరు కానిస్టేబుళ్ళు, హోంగార్డు సస్పెన్షన్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 21: వెంకటగిరి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్ళు డి. రమణ, మస్తాన్‌లను బుధవారం సస్పెండ్ చేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలు జారీ చేశారు.స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులకు న్యాయం చేయకపోగా అక్రమాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలడంతో ఈ చర్యలు తీసుకున్నారు. శ్రీసిటీ స్టేషన్‌లో గతంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు చిన్నతంబి ట్రావెల్స్, స్క్రాప్ ఓనర్ల నుంచి వసూళ్లకు పాల్పడినట్లు తెలియడంతో తిరుపతి ఈస్ట్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇక్కడ కూడా వసూళ్ళకు పాల్పడుతున్నట్లు విచారణలో రుజువు కావడంతో చిన్నతంబిని తాజాగా ఎస్పీ సస్పెండ్ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల తిరుపతిలో ఎమ్మెల్యే అనుచరులమంటూ కానిస్టేబుల్‌పై దౌర్జన్యం చేసిన ఘటనలోనూ బాధ్యులపై కేసు నమోదు చేయాలని ఆదేశించామన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని, ఈ విషయంలో ఎవరికీ మినహాయింపు వుండదన్నారు. పోలీసు విభాగంలో పనిచేసేవారు ఏ చిన్న తప్పు చేసినా క్షమించేది లేదని హెచ్చరించారు.వచ్చే 10 రోజుల్లో బదిలీలు పూర్తయి కొత్త అధికారులు వచ్చిన తరువాత పోలీసు శాఖను ప్రక్షాళన చేస్తానన్నారు.సరిగా పనిచేయని అధికారులు, సిబ్బంది జాబితాను ఇప్పటికే తెప్పించుకున్నామని, వారిలో పరివర్తన కనిపించకపోతే తీవ్రంగా పరిగణిస్తానన్నారు.

రెవెన్యూ బదిలీలకు కమిటీ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 21: ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ అధికారుల, ఉద్యోగుల బదిలీలకు కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, మండల రెవెన్యూ అధికారి, టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ (గ్రేడ్-1, 2) బదిలీలకు కమిటీ అధ్యక్షుడిగా ఉమ్మడి చిత్తూరు జిల్లా నోడల్ అథారిటీగా ఉన్న కలెక్టర్ సుమిత్‌కుమార్, సభ్యుడిగా తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, చిత్తూరు జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. చిత్తూరు జిల్లా పరిధిలో బదిలీలకు ఏర్పడిన కమిటీకి ఛైర్మన్‌గా కలెక్టర్, సభ్యుడిగా జేసీ, కన్వీనర్‌గా డీఆర్వో వ్యవహరిస్తారు. తహసీల్దార్, వీఆర్వోల బదిలీలను ఈ కమిటీ నిర్వహిస్తుంది. డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, ఎంఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టుల బదిలీలకు జేసీ అధ్యక్షతన మరో కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీలో సభ్యులుగా డీఆర్వో, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఉంటారు.

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 21:ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వెనక్కితీసుకోవాలని,క్రిమీలేయర్ ద్వారా రిజర్వేషన్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని తిరుపతి అంబేడ్కర్ భవన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పరమశివం, నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ పిలుపునిచ్చిన బంద్‌ను జిల్లాలో జైభీమ్, జైభారత్ దళిత సంఘాలు, బీఎస్పీ , అంబేడ్కర్ కమిటీ, మాలమహానాడు, మహాసభ, వివిధ దళిత సంఘాల నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీలను విభజించే కుట్రకు బీజేపీ పాల్పడుతోందని మండిపడ్డారు. ఈ సందర్భంగా తిరుపతి ఆర్టీసీ బస్టాండు ముందున్న అంబేడ్కర్ విగ్రహ కూడలిలో నిరసన ర్యాలీ చేశారు. ట్రాఫిక్ స్తంభించడంతో ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీసీ అధికారులు వాహనాలను కాసేపు దారిమళ్లించారు.అంతకుముందు ఈస్ట్‌పోలీస్‌స్టేషన్, రైల్వే స్టేషన్, కర్నాలవీధి మీదుగా ఎన్టీఆర్ కూడలి, జ్యోతిరావుపూలే విగ్రహం, ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ, ఎస్వీ యూనివర్శిటీ, పద్మావతి కాలేజ్, మహిళా యూనివర్శిటీ మీదుగా దళిత సంఘాల నేతలు ర్యాలీ నిర్వహించారు.అంబేడ్కర్ భవన్ ట్రెజరర్ మురళి, ఇంద్రముని, ధనశేఖర్, ప్రసాదరావు, రాధాకృష్ణ, చెన్నకేశవులు, సురేష్‌కుమార్, రాజేష్‌కుమార్, చిరంజీవి, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.




తిరుపతి బస్టాండులో మోహరించిన పోలీసులు

బంద్ ప్రభావం నిల్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ పిలుపున్చిన బంద్ ప్రభావం బుధవారం పెద్దగా కనిపించలేదు.వర్తక, వాణిజ్య సంస్థలు వ్యాపారాలు కొనసాగించగా విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు యధావిధిగా పనిచేశాయి. రైళ్ళు ,ఆర్టీసీ బస్సుల రాకపోకలు యధావిధిగా కొనసాగాయి. తిరుపతిలో కొన్ని విద్యాసంస్థలకు ముందుగా సెలవు ప్రకటించిన యాజమాన్యాలు మళ్ళీ బుధవారం ఉదయం సెలవు లేదని మెసేజ్ పెట్టాయి. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటాయన్న అనుమానంతో ఎక్కడికక్కడ పోలీసులు రోడ్లపై మోహరించారు.అనుమానం వున్న వారిని విచారించి పంపారు.బ్యాంకుల వద్ద భద్రత ఏర్పాటు చేశారు.ఎస్పీ సుబ్బరాయుడు తిరుపతిలో కొన్ని ప్రాంతాల్లో తిరిగి బంద్ ప్రభావాన్ని పరిశీలించారు.

నీటి వినియోగంపై టీటీడీ ఆంక్షలు


మూడు కొళాయిల్లో ఒకటి బంద్

- తిరుమలలో ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు
- హోటళ్లకు ఇకపై ఎనిమిది గంటలే సరఫరా
- అదనంగా కావాలంటే నుంచి తిరుపతి నుంచి తెచ్చుకోవచ్చు


తిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో నీటి వినియోగంపై టీటీడీ ఆంక్షలు విధించింది. భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు, భక్తులకు నీటి కొరత ఏర్పడకుండా చూసేందుకు హోటళ్లకు, మఠాలకు, స్థానికులకు ఇకపై నీటి సరఫరా నిరంతరం ఉండదంటూ ఉత్తర్వులు జారీ చేసింది. తిరుమల అవసరాలకు రోజూ దాదాపు 40 లక్షల గ్యాలన్ల నీరు అవసరం. ఈ నీటిని పాపవినాశనం, కుమారధార, పసుపుధార, గోగర్భం, ఆకాశగంగ డ్యాముల నుంచి తీసుకుని శుద్ధి అనంతరం సరఫరా చేస్తుంటారు. 14,304 లక్షల గ్యాలన్ల నీటి సామర్థ్యం ఉన్న ఈ డ్యాముల్లో ప్రస్తుతం నీళ్లు సగానికి పైగానే ఉన్నాయి. అయితే వర్షాలు తక్కువగా పడడం, రాబోయే రోజుల్లో వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నాయనే అంచనా వేసిన టీటీడీ ప్రస్తుతం ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని భావిస్తోంది.ఏడెనిమిదేళ్ల క్రితం అమలు చేసిన నీటిపొదుపు చర్యలను పరిశీలించి వాటినే పాటించాలని భావించి నీటి నియంత్రణ నిబంధనలను ఈ నెల మొదటి వారంలో ఇంజినీరింగ్ వాటర్‌వర్క్స్ విభాగం విడుదల చేసింది.తిరుమలలోని హోటళ్లు, జనతా క్యాంటీన్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు టీటీడీ వాటర్‌వర్క్స్ విభాగం 24 గంటల పాటు నీటిని సరఫరా చేస్తోంది. ఈనెల 25వ తేదీ నుంచి ఉదయం 6 నుంచి 10 గంటలకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు మొత్తం ఎనిమిది గంటల పాటు మాత్రమే నీటిని సరఫరా చేయనున్నట్లు నోటీసులను హోటళ్ల నిర్వాహకులకు అందజేసింది.అదనపు నీరు కావాలంటే విజిలెన్స్ అనుమతితో తిరుపతి నుంచి ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా తెచ్చుకోవచ్చని సూచించింది.మఠాలకు కూడా ఇదే తరహాలో అంక్షలు విధించారు. తిరుమలలోని అన్నప్రసాదభవనం, ముఖ్యప్రాంతాల్లోని నీటి కుళాయి కేంద్రాలు, కాటేజీల్లో నీటి వినియోగాన్ని తగ్గించే ప్రణాళికలు కూడా సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే జలప్రసాదాల్లో కొన్ని నీటి కుళాయిలను మూసివేశారు. నాలుగు కుళాయిలున్న చోట రెండు,ఐదు కుళాయిలున్న చోట మూడింటికి కుదించారు.పలు ప్రాంతాల్లో జరుగుతున్న కాటేజీల నిర్మాణానికి సంబంధించిన కాంట్రాక్టర్లకు కూడా నిబంధనలు పెట్టారు.తిరుపతి నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకోమని సూచించారు.

బాలాజీనగర్‌కు ఆరు రోజులకోసారి

నీటిపొదుపులో భాగంగా తిరుమలలో స్థానికులు నివసించే బాలాజీనగర్‌కు ఆరు రోజులకోసారి మాత్రమే నీటిని విడుదల చేస్తామని టీటీడీ ప్రకటించడంతో స్థానికుల్లో భయం మొదలైంది.ఇక్కడ మొత్తం 1,060 ఇళ్లుండగా దాదాపు 10 వేలమంది నివాసముంటున్నారు. ఆరు రోజులకోసారి నీళ్లు విడుదల చేస్తే వంటకు కూడా ఇబ్బందిపడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. మూడురోజులకు ఓసారైనా నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.

4 నెలలకు మాత్రమే నీళ్లున్నాయ్: టీటీడీ

తిరుమలలో నీటి అవసరాలను తీర్చడానికి ఐదు ప్రధాన డ్యాముల్లో ప్రస్తుతమున్న నీరు 120 నుంచి 130 రోజులు మాత్రమే సరిపోతాయని టీటీడీ బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది. తిరుమలలోని డ్యాముల్లో 5,800 లక్షల గ్యాలన్ల నీరు మాత్రమే అందుబాటులో ఉందని, రానున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నీటి వినియోగాన్ని నియంత్రించేందుకు కొన్ని చర్యలు తీసుకుంటున్నట్లు టీటీడీ పేర్కొంది.


బాలాజీనగర్

రాయలసీమ జిల్లాలను అభివృద్ధి చేయండి

-కాంగ్రెస్ నేత తులసిరెడ్డి



తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 21: రాళ్లసీమగా మారిన రాయలసీమను అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ పార్టీ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెయిల్ ఆధ్వర్యంలో కడపలో స్టీల్ ఫ్యాక్టరీని నిర్మించడానికి ప్రభుత్వాలు ఎలాంటి ప్రయత్నం చేయకపోవడం అన్యాయమని విమర్శించారు.శ్రీబాగ్ ఒప్పందం మేరకు కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.కర్ణాటకలో అక్రమంగా ప్రాజెక్టుల ఎత్తుపెంచడాన్ని రాష్ట్రప్రభుత్వం అడ్డుకోవాలని కోరారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం నిర్మించనున్న తీగల వంతెనను, బ్రిడ్జి-బ్యారేజ్‌లుగా నిర్మిస్తే ప్రజలకు ఉపయోగకరమన్నారు.కాంగ్రెస్ నాయకులు మాంగాటి గోపాల్‌రెడ్డి, వెంకటనరసింహులు, అమరనాథరెడ్డి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవికి సైకం సత్కారం



తిరుపతి రూరల్, ఆగస్టు 21: తిరుపతి పర్యటనకు వచ్చిన సినీనటుడు చిరంజీవిని సివిల్‌సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సైకం జయచంద్రారెడ్డి బుధవారం రేణిగుంట విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. తన కుమారుడు సైకం శివచైతన్యరెడ్డితో కలసి చిరంజీవిని దుశ్శాలువాతో సన్మానించారు.

భక్తుల ఆరోగ్య భద్రత టీటీడీ ప్రథమ కర్తవ్యం

టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు సరసమైన ధరలకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడంతో పాటు వారి ఆరోగ్య భద్రతే టీటీడీకి అత్యంత ప్రాధాన్యత అని అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నారు. టీటీడీ ఆరోగ్య విభాగం, ఆహార భద్రత విభాగాలతో కలిసి తిరుమలలోని హోటళ్ల నిర్వాహకులు, యజమానులకు తిరుమలలోని శ్రీవారిసేవాసదన్‌లో బుధవారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో అదనపు ఈవో పాల్గొని మాట్లాడారు. హోటళ్లలో అన్ని రకాల తినుబండారాలను ఫుడ్ సేఫ్టీ నిర్దేశించిన ప్రమాణాల మేరకే తయారు చేయాలని చెప్పారు. న్యూఢిల్లీకి చెందిన ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫైడ్ ట్రైనర్ అంజనేయులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో అన్ని రెస్టారెంట్లు, తినుబండారాలలో అనుసరించాల్సిన పరిశుభ్రత, పారిశుద్ధ్య పద్ధతులు, ఆహారం చెడిపోవడం వల్ల కలిగే భౌతిక-రసాయన-జీవ ప్రమాదాలు, వృథా వంటి వాటి గురించి వివరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తీసుకునే చర్యల గురించి తెలియజేశారు. టీటీడీ ఆరోగ్య శాఖ డిప్యూటీఈవో ఆశాజ్యోతి మాట్లాడుతూ.. ఇక నుంచి ప్రతి మూడు నెలలకొకసారి తిరుమలలో హోటళ్ల వ్యాపారులందరికీ ఈశిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో హెల్త్‌ఆఫీసర్ మధుసూదన్‌రావు, జిల్లా ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, తిరుమల ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జగదీష్, తిరుమలలోని హోటళ్ల వ్యాపారులు, టీటీడీ అన్నప్రసాదం సిబ్బంది పాల్గొన్నారు.

అట్లాస్ పుస్తకాల పంపిణీ



పాకాల, ఆగస్టు 21: మండలంలోని దామలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాకాల ప్లాటినం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కేఎస్ తులసీరామన్ అట్లాస్ పుస్తకాలు, మ్యాప్‌లు అందజేశారు. బుధవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నాగరాజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అట్లాస్ పుస్తకం ఉపయోగం గురించి వివరించారు. బీటీఏ నాయకులు జి.అంజినేయులు, ఆదికేశవులు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు జి.రామయ్య, కె.ఎస్.మస్తాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తుల తయారీతో మెరుగైన జీవనోపాధి



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ జగపతిరామయ్య, పక్కనే డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్, ఆగస్టు 21: విలువ ఆధారిత పాల ఉత్పత్తుల తయారీపై అవగాహన పెంచుకోవడం ద్వారా అధికలాభాలతోపాటు మెరుగైన జీవనోపాధిని పొందవచ్చని ఎస్వీ వెటర్నరీ కళాశాల ఏడీ డాక్టర్ జగపతిరామయ్య, డెయిరీ టెక్నాలజీ కళాశాల ఏడీ డాక్టర్ రవీంద్రరెడ్డి పేర్కొన్నారు. పశు ఉత్పత్తుల సాంకేతికశాస్త్ర విభాగం(ఎల్‌పీటీ) ఆధ్వర్యంలో ఐసీఏఆర్-ఎస్సీ సబ్‌ప్లాన్ ఆర్థిక సౌజన్యంతో బుధవారం ఎస్వీఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు విలువచేకూరిత పాలపదార్థాల తయారీ-మార్కెటింగ్‌పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎల్‌పీటీ హెడ్ డాక్టర్ జి.వి జయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ విజయగీత, డాక్టర్ రవివర్మ, డాక్టర్ జెడ్ నవీన్, డాక్టర్ గంగరాజు, డాక్టర్ శ్వేత పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

కలుపుమొక్క అవగాహన వారోత్సవాలు

తిరుపతి రూరల్, ఆగస్టు 21: తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లెలోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో పార్థీనియం కలుపుమొక్క నివారణ కోసం నిర్వహించిన అవగాహనా వారోత్సవాలను బుధవారం ప్రారంభించారు. శాస్త్రవేత్తలతో ఉద్యోగులు కలసి చెరకుపంట, గట్లపై ఉన్న వయ్యారిభామ కలుపుమొక్కని తొలగించారు. ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ ఎస్వీ సరళ మాట్లాడుతూ.. పార్థీనియం కలుపుమొక్కని నివారించకపోతే కలిగే దుష్ప్రభావాన్ని వివరించారు. శాస్త్రవేత్తలు కేఆర్ ఠాగూర్, బి.వజంత, సిబ్బంది రాధ, వినయవతి, మునిశేఖర్ నాయుడు, మోహన్‌రెడ్డి, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో వైసీపీ నేతల చేరిక



చిరంజీవిరెడ్డిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్, ఆగస్టు 21: తిరుపతి రూరల్ మండలం వేదాంతపురానికి చెందిన పలువురు వైసీపీనేతలు బుధవారం ఎమ్మెల్యే పులివర్తి నాని సమక్షంలో పసుపు కండువాలు కప్పుకున్నారు. మాజీసర్పంచ్ తోట చిరంజీవిరెడ్డి, ముదిరాజ్ చంద్రలతోపాటు వారి అనుచరులు టీడీపీలో చేరారు.ఎమ్మెల్యే నాని నేతృత్వంలో పంచాయతీలో టీడీపీని మరింతగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. నాని మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా ప్రజాసమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, నేతలు చెరుకుల పరంధామయాదవ్, కుమార్‌స్వామి, శ్యామ్‌బాబు, డిల్లీయాదవ్, శ్రీధర్ నాయుడు, కృష్ణమూర్తిరెడ్డి, అవిలాల సుధాకర్, నాగూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధుల కేటాయింపు హర్షణీయం:వైవీబీ

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 21: పంచాయతీలకు నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు కేటాయించడం హర్షణీయమని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ నాయకులు వైవీబీ రాజేంద్రప్రసాద్, సింగం శెట్టి సుబ్బరామయ్య పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా జగన్ ప్రభుత్వం పంచాయతీలకు నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేసిందని విమర్శించారు.14, 17 ఆర్థిక సంఘం రాష్ట్రానికి విడుదల చేసిన రూ.10,600 కోట్లను అప్పటి ముఖ్యమంత్రి జగన్ దారి మళ్లించి స్వప్రయోజనాలకు వినియోగించుకున్నారని వారు ఆరోపించారు.ఉపాధి హామీ నిధులు కూడా పంచాయతీలకు అందకుండా అడ్డుకున్నారని విమర్శించారు. అమరావతిలో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్న వెంటనే నిధులు కేటాయించి ముఖ్యమంత్రి చంద్రబాబు తన హామీని నిలుపుకోవడం గర్వకారణమన్నారు. పీఎఫ్ఎంఎస్ ఖాతాల్లో రూ.998 కోట్లు జమచేయడంతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని వెల్లడించారు. పంచాయతీలకు జలజీవన్ మిషన్ ద్వారా రూ.500 కోట్లు ముఖ్యమంత్రి విడుదల చేయడానికి నిర్ణయం తీసుకోనున్నారని వారు వెల్లడించారు. ఈ నిధులు విడుదలైతే ప్రతి గ్రామంలో నీటి సమస్య తీరే అవకాశం ఉందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధుల గౌరవ వేతనాలు పెంచడానికి కూడా నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు ప్రతాపరెడ్డి, ధనంజయుడు, కె.మురళి, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో....

తిరుచానూరు, ఆగస్టు 21: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని బుధవారం ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షులు వైవీబీ రాజేంద్రప్రసాద్,ప్రధాన కార్యదర్శి బీరు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య, కొత్తపు మునిరెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు చుక్కా ధనుంజయ్‌యాదవ్, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కుప్పాల మురళి దర్శించుకున్నారు.



తిరుచానూరు ఆలయం వద్ద వైవీబీ తదితరులు

ఎస్వీ పాలిటెక్నిక్ స్కిల్‌హబ్‌లో నైపుణ్యాలపై ఉచిత శిక్షణ

తిరుపతి(విద్య), ఆగస్టు 21: వివిధ కంపెనీలకు కావలసిన విధంగా నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి... ఉపాధి కల్పించనున్నట్లు తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వై.ద్వారకానాథరెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 పథకంద్వారా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో ఈ శిక్షణా కార్యక్రమాలు ఉంటాయని ఆయన వివరించారు. ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశం కల్పిస్తారు. రోజులో 4 గంటలు మాత్రమే స్కిల్ హబ్‌లో శిక్షణా తరగతులు ఉంటాయి. 15 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయసు లోపలివారు మాత్రమే శిక్షణకు అర్హులు. శిక్షణ పూర్తిచేసిన వారికి ఎన్ఎస్‌డీసీ జారీచేసే ఎన్‌సీవీఈటీ సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు.

కోర్సుల వివరాలు:

జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, ఫీల్డ్ టెక్నీషియన్ నెట్‌వర్కింగ్ అండ్ స్టోరేజ్ కోర్సుల్లో శిక్షణ ఉంటుంది. 10వ తరగతి, ఆపైన ఉత్తీర్ణులైనవారు ఈ శిక్షణలో చేరేందుకు అర్హులు. రెండు కోర్సులకు మొత్తం 210 గంటల శిక్షణ ఉంటుంది. ఆసక్తి కలిగిన యువతీ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. 72073 89948, 90009 57055 నెంబర్లలో సంప్రదించి అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. నేరుగా కలవాలనుకునేవారు తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో సంప్రదించవచ్చు.

రోగుల సహాయకులకు తప్పని తిప్పలు

రుయాలో స్ట్రెచర్, వీల్‌చైర్ కావాలంటే ఫోన్, నగదు డిపాజిట్ చేయాల్సిందే



రోగులను స్ట్రెచర్‌పై వైద్య పరీక్షలకు తీసుకువెళుతున్న సహాయకులు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 21: అయిన వారిని వైద్యం కోసం తీసుకువచ్చే రోగుల సహాయకులు పడే కష్టాన్ని అధికారులు చోద్యంలా చూడటం తప్ప దాని పరిష్కారానికి చర్యలు చేపట్టని దుస్థితి రుయాస్పత్రిలో కొనసాగుతోంది. నడవలేని స్థితిలో ఉన్న రోగులను వైద్యం కోసం రుయాస్పత్రికి తీసుకువస్తే వారికి సాయంగా కచ్చితంగా ఇద్దరు సహాయకులు దగ్గర ఉండాల్సిందే. లేకపోతే ఆ రోగికి అడ్మిషన్ కూడా ఇవ్వరు. ఎందుకంటే రోగిని పడకపై నుంచి పక్కకు జరపాలన్నా లేదా వైద్య పరీక్షలకు, డాక్టర్ల వద్దకు తీసుకువెళ్లాలన్నా అది రోగుల సహాయకులే చేయాలి. ఇందుకోసం ఆస్పత్రిలో ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోలు ఉన్నా వారు ఎక్కడా కనిపించరు. ఒకవేళ కనిపించినా వారు అడిగినంత ఇస్తే తప్పా రోగికి సాయపడరు. దీంతో రోగుల సహాయకులు ఒకటి రెండు రోజులు అయితే సిబ్బంది అడిగినంత ఇచ్చుకొని సాయం పొందుతారు. అపై ఉండాల్సి వస్తే సిబ్బంది అడిగినంత ఇచ్చుకోలేక రోగిని వారే స్ట్రెచ్చర్, వీల్‌చైర్‌లో తీసుకువెళతారు. ఇక్కడ కూడా వీల్‌చైర్, స్ట్రెచ్చర్ కావాలంటే రోగుల సహాయకులు అక్కడి సిబ్బందికి వారి ఫోన్ లేదా కొంత నగదు డిపాజిట్ చేయాలి. తిరిగి వీల్‌చైర్, స్ట్రెచ్చర్‌ను తీసుకువచ్చి సిబ్బందికి అప్పగించిన తరువాత వారి ఫోన్ లేదా నగదును తిరిగి ఇస్తారు. ఈ విషయంపై అధికారులకు రోగులు ఫిర్యాదులు చేసినా మీరు తీసుకువెళ్లిన వీల్‌చైర్లను భద్రంగా తీసుకువచ్చి అప్పగించాలనే ఉద్దేశంతోనే సిబ్బంది అలా చేస్తారని.. వారికి సహకరించండి అంటూ సమాధానం చెబుతూ సిబ్బందిని వెనుకేసుకొస్తున్నారు. ప్రతి వార్డులో రోగులకు సాయంగా ఉండాల్సిన సిబ్బంది కేవలం ఓటీలు, కొన్ని అత్యవసర విభాగాల్లో మాత్రమే విధులు నిర్వహిస్తూ అక్కడ రోగుల అవసరాలను సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో సాధారణ వార్డుల్లో, ఓపీ కేంద్రాల వద్ద విధులు నిర్వహించేందుకు వారు ముందుకు రాకపోవడంతో రోగులకు, వారి సహాయకులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనిపై జిల్లా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వాశయాలకు అనుగుణంగా పనిచేయండి: కలెక్టర్



మహిళా, శిశు సంక్షేమ శాఖాధికారులతో కలెక్టర్ సమీక్ష

తిరుపతి(విద్య), ఆగస్టు 21: ప్రభుత్వాశయాలకు అనుగుణంగా... సుస్థిరాభివృద్ధే ధ్యేయంగా... లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖాధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. మహిళ, శిశు సంక్షేమశాఖ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, డీసీపీఓ, మహిళా ప్రాంగణం డీఎం, వన్‌స్టాప్ సెంటర్ అధికారి తదితరులతో బుధవారం ఆయన కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... అధికారులు, సిబ్బంది ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని సూచించారు. మాతా శిశు మరణాలు సంభవించకుండా ప్రసూతి కాన్పులు జరిగేలా కృషి చేయాలని చెప్పా రు. మిషన్ వాత్సల్య సక్రమంగా అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా ప్రాంగణం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటుచేయాలని చెప్పారు. సఖి సదనం, కళాశాల విద్యార్థుల సదనాల పనితీరు బాగుండాలన్నారు. శ్రీకాళహస్తి బాలల సదనం పనితీరు మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా విభాగాల అధికారులందరూ సమన్వయం చేసుకుంటూ అన్ని విధాల పురోగతి సాధించాలని పిలుపునిచ్చారు. రానున్న 100 రోజుల్లో లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అభివద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారిణి జయలక్ష్మి, డీసీపీఓ శివశంకర్, వన్‌స్టాప్ సెంటర్ ఇంచార్జి సీడీపీఓ, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.46 కోట్లు

తిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.46 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి, బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 73,082 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 27,972 మంది తలనీలాలు సమర్పించారు.

మహిళలకు బ్యూటీ పార్లర్‌పై శిక్షణ

చంద్రగిరి, ఆగస్టు 21: చంద్రగిరి పట్టణంలోని ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 27వ తేదీ నుంచి 30 రోజుల పాటు మహిళలకు బ్యూటీ పార్లర్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆసంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాలో గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుండి 40 సంవత్సరాల మధ్య కలిగిన నిరుద్యోగ మహిళలు ఈశిక్షణకు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 79896 80587, 94949 51289, 63017 17672 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పుష్పిత్‌స్టీల్‌లో బిహార్ కార్మికుడి మృతి



మృతి చెందిన మహమ్మద్ ఆర్మాన్

ఏర్పేడు, ఆగస్టు 21: ఏర్పేడు మండలం మేర్లపాక వద్ద ఉన్న పుష్పిత్‌స్టీల్ కర్మాగారంలో బిహార్‌కు చెందిన కార్మికుడు మృతి చెందాడు. బిహార్ రాష్ట్రం ఆరారియా జిల్లా రాంనగర్ పంచాయతీకి చెందిన మహమ్మద్ ఆర్మాన్(22) రెండేళ్ల క్రితం పుష్పిత్‌స్టీల్స్ కర్మాగారంలో పనిచేయడానికి వచ్చాడు. కర్మాగార ఆవరణలో ఉన్న క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి 10గంటలకు విధులకు వెళ్లాడు. బుధవారం ఉదయం 6 గంటలకు డ్యూటీ నుంచి రూమ్‌కు రావాల్సిన మహమ్మద్ ఆర్మాన్ 9 గంటలైనా రాకపోవడంతో తోటి కార్మికులు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ పనిచేస్తున్న అధికారులు కార్మికులతో కలిసి కర్మాగారం లోపల గాలించగా వాటర్ కూలింగ్ కాంప్లెక్సులో పడి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మహమ్మద్ ఆర్మాన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రుసా సమన్వయకర్తల నియామకం



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 21: ఎస్వీయూలో రుసా సమన్వయకర్తలుగా ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్లు రమాశ్రీ, ఉషను నియమించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు అందజేసి అభినందించారు.

రేపు ఉపాధి గ్రామసభలు

రామచంద్రాపురం, ఆగస్టు 21: మండలంలోని 23 పంచాయతీల్లో 23న ఉపాధి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రత్యూష తెలిపారు. ఉపాధిపనులకు సంబంధించి రూ.2కోట్ల నిధులతో సీసీరోడ్డు, మురుగుకాలువలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

వైభవంగా అర్జున తపస్సు



తపస్మాన్ అధిరోహిస్తున్న అర్జున వేషధారి

రామచంద్రాపురం, ఆగస్టు 21:రామచంద్రాపురం మండలంలోని ఎన్ఆర్ కమ్మపల్లి మహాభారత ఉత్సవాల్లో బుధవారం అర్జున తపస్సు కార్యక్రమం వైభవంగా జరిగింది. సాయంత్రం అర్జున వేషధారి శివుడిని ప్రార్థిస్తూ తపస్మాన్ అధిరోహించారు. అక్కడి నుంచి పూలు, పండ్లు విసరడంతో భక్తులు అందుకున్నారు. తపస్మాన్ చుట్టూ సంతానం, పెళ్లిళ్ల కోసం భక్తులు ఒరపడ్డారు. సాయంత్రం మేళతాళాల నడుమ ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగింది. ఆలయ ధర్మకర్తలు రమేష్‌బాబు, రవికుమార్, ప్రధాన అర్చకులు హరి ఆచారి పాల్గొన్నారు.

తమిళనాడు మద్యంతో ఐదుగురి అరెస్టు

ఎర్రావారిపాలెం, ఆగస్టు 21: తమిళనాడు నుంచి మద్యం తీసుకొని తలకోనకు వస్తుండగా పోలీసులు అరెస్టు చేసినట్లు ఎర్రావారిపాలెం ఎస్సై డీవై స్వామి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడుకు చెందిన ఫజిల్, అలీమ్, ఆరీష్, ఆలీ, షఫుద్దీన్‌లు తరచూ తలకోన పర్యాటనకు వస్తుంటారు. ఏపీలో మద్యం రేట్లు అధికంగా ఉన్నాయని తమిళనాడు నుంచి మద్యం తీసుకొచ్చి సేవించేవారు. ఈ క్రమంలో మంగళవారం తమిళనాడు నుంచి కారులో తలకోనకు వస్తుండగా, పోలీసులు తనిఖీ చేయగా మద్యం బయటపడింది. దీంతో వీరిని అదుపులోనికి తీసుకొని కారు సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శ్రీగంధం కేసులో 9మంది అరెస్టు

ఎర్రావారిపాలెం, ఆగస్టు 21: శ్రీగంధాన్ని స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకొన్నారు.ఎర్రావారిపాలెం పోలీసుల కథనం మేరకు శ్రీగంధం అక్రమ రవాణా జరుగుతోందనే సమాచారంతో ఎర్రావారిపాలెం - రొంపిచెర్ల రోడ్డు జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద బుధవారం పోలీసులు నిఘా వేశారు.వేగంగా వస్తున్న ఆటోను ఆపి పరిశీలించగా, రెండు మూటలున్నాయి. వాటిని విప్పి పరిశీలించగా శ్రీగంధం ఉన్నట్లు గుర్తించారు. శ్రీగంధాన్ని స్మగ్లింగ్ చేస్తున్న సుక్కలపాటి రమేష్, ఇరువారం మోహన్, ఆవులమడుగు రమేష్, గుండ్రాతికుప్పం చంద్రయ్య, సుక్కలపాటి లక్ష్మయ్య, కనికరం నాగరాజ, సుక్కలపాటి రాజేశ్వరి, ఆవులమడుగు కవిత, వై.గౌరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

తిరుమలలో అనధికార నివాసాల తొలగింపు

తిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఉన్న అనధికార నివాసాలను టీటీడీ గురువారం తొలగించింది. తిరుమల భద్రత దృష్ట్యా ఇటీవల విజిలెన్స్, పోలీసు అధికారులు తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు చేసిన విషయం తెలిసిందే. ఎలాంటి గుర్తింపు లేని వ్యక్తులను గుర్తించడంతో పాటు నిషేధిత వస్తువులు ఏమైనా ఉన్నాయా అనే అంశంపై తనిఖీలు చేశారు. కాగా, గతంలో భవన నిర్మాణం కోసం వచ్చిన కార్మికులు తమ పనులు పూర్తయినప్పటికీ ఇంకా తిరుమలలోనే ఉన్నట్టు గుర్తించారు. బాలాజీనగర్‌కు సమీపంలోని పాచికాల్వ గంగమ్మ ఆలయానికి సమీపంలో 70పైగా ఉన్న షెడ్లలో నివాసముంటున్నట్టు గుర్తించారు. ఈక్రమంలో కొంతమంది అనధికార వ్యక్తులను తిరుమల నుంచి పంపేశారు. మరికొంతమంది నుంచి వివరాలను సేకరించారు. కాగా, భవన కార్మికుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లను బుధవారం సాయంత్రం పొక్లెయినర్‌తో తొలగించారు.

తొండవాడ హౌసింగ్ కాలనీని సందర్శించిన ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, ఆగస్టు 21: చంద్రగిరి మండలం, తొండవాడ సమీపంలోని హౌసింగ్ కాలనీని బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే పులివర్తి నాని సందర్శించారు. కాలనీవాసులతో మాట్లాడి త్వరలోనే మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరగా ఇంటి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. కాలనీలో బినామీల పేరుతో ఉన్న ఇండ్లను గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తిరుపతి రూరల్, చంద్రగిరి మండల రెవెన్యూ, ఎంపీడీవో, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్లో తనిఖీ

చంద్రగిరి, ఆగస్టు 21: చంద్రగిరిలోని ప్రభుత్వ బాలికల హాస్టల్‌ను తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో బాలాజీనాయక్, ఎంఈవో భాస్కర్‌బాబులు బుధవాం అకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ గదులను, వంట గదిని పరిశీలించారు. హాస్టల్లో నెలకొన్న సమస్యలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డెన్ వనజతో మాట్లాడి సమస్యలను రాత పూర్వకంగా ఇస్తే ఉన్నతాధికారులకు పంపించి పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.


చంద్రగిరి పాలిటెక్నిక్‌లో సర్టిఫికెట్ కోర్సులు

చంద్రగిరి, ఆగస్టు 21: చంద్రగిరి మండలంలోని అగరాల సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సెప్టెంబరు మొదటి వారం నుంచి ఐవోటీ(ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్), క్యాడ్ (కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్) నూతన సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, ఇంటర్మీడియట్, డిప్లమా, బీటెక్, ఏదైనా డిగ్రీ అర్హత ఉన్న అభ్యర్థులు ఈకోర్సులకు అర్హులన్నారు. ఈకోర్సులను ఏపీ స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసుకొన్నవారికి సర్టిఫికెట్లు కూడా ఇవ్వనున్నారు. ఈకోర్సులకు రూ.1500 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మరింత సమాచారం కోసం ఫణికుమార్, డాక్టర్ ప్రకాష్‌లను 80745 30468, 70132 99609 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎస్టీల భూములపై వైసీపీ నేత కన్ను

అధికారుల అండతో వెబ్‌ల్యాండ్‌లో మార్పులు ● పంట రుణం కోసం వన్ బీ తీసుకోవడంతో వెలుగులోకి







బి.సుదర్శన్‌రెడ్డి, బి.పుట్టారెడ్డి పేర్లతో ఉన్న వన్ బీ - ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను చూపుతున్న ఎస్టీలు

ఏర్పేడు, ఆగస్టు 21: పేదల జీవనాధారం కోసం మూడు దశాబ్దాల కిందట ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ బలం, అధికారుల అండదండలతో ఆన్‌లైన్‌లో తమ పేర్లతో వైసీపీ నేతలు మార్చుకున్నారు. ఏర్పేడు మండలం ముసలిపేడు పంచాయతీలో ఎస్టీ(ఎరుకుల) కులానికి చెందిన దాసా సుబ్బమ్మ పేరుతో సర్వే నెంబరు 398/1ఏ, 1బిలో 2 ఎకరాలు, మెండ్రగుత్తి నాగమ్మ పేరుతో సర్వే నెంబరు 398/2ఏ, 2బిలో రెండు ఎకరాలు, మెండ్రగుత్తి జయమ్మ పేరుతో సర్వే నెంబరు 398/2సి, డిలో 2 ఎకరాలు, దాసా కాంతమ్మ పేరుతో సర్వే నెంబరు 398/1సి, 1డిలో రెండు ఎకరాలు. మొత్తంగా నలుగురు రైతులకు ఒక్కొక్కరికి రెండు ఎకరాలు చొప్పున 8 ఎకరాల భూమిని 30ఏళ్ల కిందట అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి నుంచి ఎస్టీలు ఆ భూమిని సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం నాలుగెకరాల్లో మామిడిచెట్లు, నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. నలుగురు రైతులకూ వారి భూముల్లో బోర్లు కూడా ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 9వ తేదీ వరకు వారి పేరుతోనే వెబ్‌ల్యాండ్‌లో వన్‌బీ రికార్డు ఉంది. జనవరిలో ఏర్పేడు తహసీల్దారుగా పనిచేసిన శివప్రసాద్ సంతకంతో శ్రీకాళహస్తి మండలానికి చెందిన వైసీపీ కీలక నేత తమ కుటుంబీకుల పేర్లతో ఆన్‌లైన్ చేసుకుని రికార్డులు మార్చుకున్నాడు. ప్రస్తుతం వైసీపీ కీలకనేత బంధువులైన బి.పుట్టారెడ్డి పేరుతో 398/2ఏ, 2బి, 2సి, 2డి సర్వే నెంబర్లకు సంబంధించి నాలుగు ఎకరాలు. బి.సుదర్శన్‌రెడ్డి పేరుతో 398/1ఏ, 1బి, 1సి, 1డి సర్వే నెంబర్లలో 4 ఎకరాలు ఆన్‌లైన్‌లో నమోదై ఉంది. బ్యాంకులో పంట రుణం పొందడానికి ఎస్టీలు వన్‌బీ తీసుకోగా తమ భూములు ఇతరుల పేరుమీద ఉండడంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. రూ.2కోట్లు చేసే భూములను కబ్జా చేయడానికి వైసీపీ నేత పథకం ప్రకారం వన్‌బీలో మార్పులు చేయించుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై తహసీల్దారు భార్గవిని వివరణ కోరగా పరిశీలించి బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని, అలాగే ఆన్‌లైన్‌లో అవకతవకలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పొర్లుదండాలతో తిరుమలకు మెగా అభిమాని



చంద్రగిరి/తిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమాని పొర్లుదండాలతో తిరుమల కొండెక్కాడు. రామచంద్రాపురం మండలం బలిజపల్లెకు చెందిన ఈశ్వర్‌రాయల్ మెగా ఫ్యామిలీకి వీరాభిమాని. మెగా ఫ్యామిలి బాగుండాలనే కోరికతో ఇప్పటికే 20సార్లు పొర్లుదండాలతో తిరుమలకు వచ్చిన ఈశ్వర్‌రాయల్ గురువారం చిరంజీవి 69వ పుట్టినరోజు సందర్భంగా 21వసారి శ్రీవారిమెట్ల మార్గంలో ఉదయం పొర్లుదండాలు ప్రారంభించారు. సాయంత్రం 6.30గంటలకు తిరుమలకు చేరుకున్న ఈశ్వర్ మీడియాతో మాట్లాడుతూ.. చిరంజీవి ఆరోగ్యంగా ఉండాలని స్వామిని కోరుకుంటున్నట్టు తెలిపారు.

అలిపిరి సీఐ బాధ్యతల స్వీకరణ



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 21: అలిపిరి సీఐగా రాంకిషోర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో తిరుపతి ఈస్ట్ సీఐగాను, ఆ తర్వాత సీఐడీలో కూడా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటనారాయణ పర్యవేక్షణలో తమ పరిధిలో గంజాయి విక్రయాలు, వినియోగం, రౌడీయిజానికి తావు లేకుండా పనిచేస్తానన్నారు. స్టేషన్‌లోని ఎస్‌ఐలు రాజశేఖర్, రామస్వామి, ఏఎస్‌ఐలు, సిబ్బంది స్వాగతం పలికి పూల బొకేలు అందచేశారు.

మహిళలూ.... మీకు మేమున్నాం

రాత్రి పూట అత్యవసరమైతే 1091కు కాల్ చేయండన్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 21: సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న అకృత్యాలు, అసభ్యకర ఘటనలు, అత్యాచారాలు, హత్యలు, మానభంగాలు వంటి వాటిని నివారించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. దీనికోసం ప్రత్యేకంగా 1091 హెల్ప్‌లైన్ నెంబరును ఏర్పాటు చేసింది. ప్రధానంగా రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఒంటరిగా వున్న మహిళ ఇంటికి వెళ్లేందుకు వాహనం దొరకని పక్షంలో పోలీసు హెల్ప్‌లైన్ నెంబరుకు ఫోన్ చేసి వాహనం కోసం అభ్యర్థించవచ్చని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. వారు 24 గంటలూ అందుబాటులో ఉండి పనిచేస్తారన్నారు. కంట్రోల్ రూము వాహనం, పీసీఆర్ వాహనం, లేకుంటే సమీపంలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్ వాహనం ఒంటరి మహిళను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చుతారని తెలిపారు. ఇది ఉచిత సేవ అని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు మిస్డ్ కాల్ చేస్తే పోలీసులు సంబంధిత లొకేషన్ వద్దకు వచ్చి సహాయం అందిస్తారని పేర్కొన్నారు. అవసరమైతే 78370 18555 నెంబరుకు కాల్ చేయవచ్చన్నారు.

నేడు రక్తదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 21: మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా గురువారం ఎస్వీయూలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. చిరంజీవి ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు పరిపాలనా భవనం వద్ద ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. మెగాస్టార్ అభిమానులు, విద్యార్థులు, ఉద్యోగులు ఈ సందర్భంగా రక్తదానం చేయవచ్చని ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధి వెంకటేష్ కోరారు.

అన్నదానం

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 21: పేదలకు అన్నదానం చేయడంలోనే సంతృప్తి ఉందని జనసేన నాయకులు రాజారెడ్డి, ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం అనంతవీధికి చెందిన ఆముదాల మురగయ్య వర్ధంతి సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు.

కోల్‌కతా ఘటన బాధాకరం



జూడాలనుద్దేశించి మాట్లాడుతున్న పులివర్తి సుధారెడ్డి

తిరుపతి(వైద్యం), ఆగస్టు 21: కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాలలో విధుల్లో ఉన్న జూనియర్ డాక్టరుపై జరిగిన హత్యాచార ఘటన బాధాకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి అన్నారు. హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని రుయాస్పత్రి ఆవరణలో జూనియర్ డాక్టర్లు నిర్వహిస్తున్న నిరసనలో బుధవారం ఆమె పాల్గొని, సంఘీభావం తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. ఇటువంటి ఘటనలు మన దగ్గర జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో విధులు నిర్వహించే సమయంలో తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను జూనియర్ డాక్టర్లు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆమె జూనియర్ డాక్టర్లతో కలిసి సూపరింటెండెంట్ రవిప్రభును కలిసి వారి సమస్యలను వివరించారు. జూనియర్ డాక్టర్లకు పని గంటలు తగ్గించాలని, మహిళా డాక్టర్లు విధులు నిర్వహించే ప్రదేశాల్లో మహిళా సెక్యూరిటీ సిబ్బందితోపాటు మహిళా పోలీసులను అందుబాటులో ఉంచేలా చూడాలన్నారు. ఆస్పత్రి ఆవరణలో భద్రతా ఏర్పాట్లు పటిష్ఠం చేయాలన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే ఎమ్మెల్యే నాని దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు. సమస్యలను తప్పక పరిష్కరిస్తామని సూపరింటెండెంట్ రవిప్రభ తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

తిరుపతి అర్బన్, ఆగస్టు 21: కోల్‌కతాలో పీజీ వైద్యవిద్యార్థిని హత్యాచార ఘటనను వ్యతిరేకిస్తూ, నిందితులను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక కృష్ణాపురం ఠాణా నుంచి జనసేన శ్రేణులు పెద్ద ఎత్తున సమూహమై కొవ్వొత్తులను చేతపట్టుకొని బ్యానర్ ప్రదర్శించారు. గాంధీరోడ్డు మీదుగా నాలుగుకాళ్ల మండపం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్‌పై అమానుషంగా ప్రవర్తించి మృగాలకు తక్షణమే శిక్ష ఖరారు చేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నినదించారు. జనసేన తిరుపతి నియోజకవర్గం ఇంచార్జ్ కిరణ్‌రాయల్, పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి, నాయకులు శివ, మదన్, సుభాషిణి, వనజ, బాబ్జీ, వెంకటేష్‌రాయల్, హరిశంకర్, వినోద్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి, కిరణ్‌రాయల్, రాజారెడ్డి తదితరులు

మహిళల రక్షణకు సామాన్యులూ పిడికిలి బిగించాలి





తిరుపతి(వైద్యం), ఆగస్టు 21: సమాజంలో జరుగుతున్న మహిళలపై దాడులను అరికట్టి, వారికి రక్షణ కల్పించేందుకు సామాన్యులు సైతం పిడికిలి బిగించాలని అప్పుడే మహిళలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టవచ్చని స్విమ్స్ ఆర్‌డీఎస్‌ఏ(రెసిడెంట్ డాక్టర్స్ అండ్ స్టూడెంట్ అసోసియేషన్) డాక్టర్లు పిలుపునిచ్చారు. కోల్‌కత్తాలోని జూనియర్ డాక్టరుపై జరిగిన హత్యాచార ఘటనకు సంబంధించి బుధవారం రాత్రి స్విమ్స్ ఆర్‌డీఎస్‌ఏ డాక్టర్లు స్థానిక ఎయిర్‌బైపాస్ రోడ్డులోని బీఎస్‌ఆర్ ఎస్వీ మాల్ వద్ద నాటక, నృత్య, సంగీత ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలతో కోల్‌కత్తాలో జూనియర్ డాక్టరుపై జరిగిన హత్యాచారం, మహిళలకు కల్పించాల్సిన రక్షణ చర్యలు, ప్రజలు చేయాల్సిన బాధ్యతల గురించి వారు వివరించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముందు ఓపీ సమయంలో స్విమ్స్‌లోని నిరసన శిబిరంలోనే రోగులకు ఓపీ వైద్య సేవలు అందించి స్విమ్స్‌లోని డాక్టర్లు తమ నిరసనను కొనసాగించారు.

బాలనరసింహారెడ్డికి ప్రముఖుల నివాళి



తిరుపతి (జీవకోన), ఆగస్టు 21: తిరుపతి కోఆపరేటివ్ బ్యాంకు మాజీ వైస్ ఛైర్మన్ పులికంటి బాలనరసింహారెడ్డి సంస్మరణ సభ బుధవారం జరిగింది. ఆయన కుమారుడు లవకుమార్, అల్లుడు నవీన్‌కుమార్‌రెడ్డి, తమ్ముడు మోహన్‌రెడ్డి, చిన్ననాటి స్నేహితులు హరిప్రకాష్‌రెడ్డి బుధవారం కరకంబాడి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో సమావేశమై ఆయన స్మృతులను నెమరువేసుకున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యేలు రెడ్డివారి రాజశేఖర రెడ్డి, సుగుణమ్మ, మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ,ఆర్టీసీ డీఎం చెంగల్‌రెడ్డి,భూమన్, వివిధ పార్టీల నేతలు నరసింహయాదవ్,మబ్బు దేవనారాయణరెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, పులిగోరు మురళి, కిరణ్‌రాయల్, రాజారెడ్డి, గుండాల గోపీనాథ రెడ్డి , దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి, భువన్‌కుమార్, జీవన్‌కుమార్, మోహన్‌రెడ్డి, డాక్టర్ రవిశేఖర రెడ్డి, హరినాథ రెడ్డి,దుగాండ్ల కుమారస్వామిరెడ్డి, కాసరం రమేష్, ఎమ్మార్సీ రెడ్డి, ముద్ర నారాయణ, కేతం జయచంద్రా రెడ్డి, సురేంద్రనాథ రెడ్డి, రెడ్డిసంఘం నాయకులు సుమతిరెడ్డి, దొడ్డారెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆనంద్‌యాదవ్, బీసీ సంఘం నాయకులు ఆల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పనులను పూర్తి చేయండి : కలెక్టర్

తిరుపతి(విద్య), ఆగస్టు 21: వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. జేసీ శుభం బన్సల్‌తో కలిసి సంబంధిత శాఖలైన రెవెన్యూ వీసీఐసీ, పీడీ, నేషనల్ హైవేస్ పీడీ, నీటి పారుదల ఎస్ఈ, అటవీశాఖ డీఎఫ్‌ఓలతో ఆయన బుధవారం కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనుల్లో భాగమైన 7 ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లకు నీటి సరఫరా పనులు, భూసేకరణ, ఆక్రమణలు తదితర విషయాలపై అధికారులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ... వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులపై దృష్టిపెట్టాలని, వాటిని త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌ఓ సతీష్, గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నెల్లూరు విజయరత్నం, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ చంద్రశేఖరయ్య, తెలుగు గంగ ప్రాజెక్ట్ ఎస్ఈ మదనమోహన్, ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయ డీటీ స్వామినాథన్ పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో అండర్- 14 క్రికెట్ ఎంపికలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 21: ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24, 25 తేదీల్లో అండర్ -14 బాయ్స్ క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు సీడీసీఏ సంఘం అధ్యక్షుడు బి.వి జయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 01-09-2010 తర్వాత జన్మించిన యువకులు అర్హులని, క్రీడాదుస్తులు, కిట్, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలన్నారు. యువ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 90002 14966, 88861 85559 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. వేదిక వివరాలిలా... పుత్తూరులోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాల, శ్రీకాళహస్తిలోని కేసీసీ క్రికెట్‌నెట్స్, పీలేరులోని పియోక్ క్రికెట్ అకాడమి, భువనవిద్యానిలయం, వాల్మీకిపురంలోని జీవీఎస్‌సీఎస్ క్రికెట్ మైదానం, తిరుపతిలోని సీవీ క్రికెట్ అకాడమి, చిత్తూరులోని పోలీసుగ్రౌండ్, పలమనేరులోని ప్రభుత్వ డిగ్రీకళాశాల, వి.కోటలోని జీఎంఆర్ క్రికెట్ అకాడమిలలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు.

చిరంజీవికి ఘనస్వాగతం





తిరుపతి అర్బన్, ఆగస్టు 21: తిరుమలకు బుధవారం సాయంత్రం వచ్చిన మెగాస్టార్ చిరంజీవికి విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ కిరణ్‌రాయల్, పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి తదితరులు స్వాగతించి శాలువకప్పి సత్కరించారు. ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆరణిశివ, ఆరణి మదన్, పొలకల మల్లికార్జున్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 16మందికి జరిమానా

తిరుపతి(లీగల్), ఆగస్టు 21: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 16మంది నిందితులకు రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ 4వ అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. అలాగే అధిక మోతాదులో మద్యం సేవించి ఆటో నడిపిన శివ, సునీల్, కారు డ్రైవర్ సురేష్‌లకు మూడు రోజుల జైలుశిక్ష విధించారు. రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు చేస్తూ వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది కలిగించిన 60మందికి రూ.500చొప్పున జరిమానా విధించారు.

బదిలీల్లో సౌలభ్యం కల్పించండి

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 21: ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీల్లో సౌలభ్యం కల్పించాలని తిరుపతి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు కోరారు. బుధవారం వారు కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న సాధారణ బదిలీల్లో గ్రామ రెవెన్యూ అధికారుల్లో అనారోగ్య సమస్యలు, దివ్యాంగులు, ఇతర సమస్యలు ఉన్న వారిని, గ్రేడ్ 1, గ్రేడ్ 2 వీఆర్వోల స్థాయి వారికి అనుకూలంగా ఉండే విధంగా బదిలీలు చేపట్టాలన్నారు. అందుకు జేసీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఆర్ నాగరాజు, తిరుపతి డివిజన్ అధ్యక్షుడు చెంగల్‌రాయులు, ప్రసాద్, మురళి, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

● ఆర్ అండ్ బీ శాఖాధికారులతో కలెక్టర్

తిరుపతి(విద్య), ఆగస్టు 21: జిల్లాలో రోడ్లు, భవనాల శాఖకు సంబంధించిన అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆ శాఖాధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన రోడ్లు, భవనాల శాఖ అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. మాట్లాడుతూ... జిల్లాలోని ప్రైమరీ హెల్త్ సెంటర్లు, ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లు, ఎంపీ లాండ్స్ ఫండ్స్, ఎన్‌డీబీ, నాబార్డ్, తుడ తదితర అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ఇంకా పూర్తికాని పనులను పూర్తిచేసేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఆర్ అండ్ బీ అధికారి మధుసూదన్‌రావు, డివిజన్ స్థాయి ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

జెన్‌ప్యాక్ట్‌లో 1500 ఉద్యోగాలు : కలెక్టర్

తిరుపతి(విద్య), ఆగస్టు 21: ప్రముఖ ఐటీ కంపెనీ జెన్‌ప్యాక్ట్‌లో 1500 ఉద్యోగాలకు బీటెక్, డిగ్రీ ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. ఈ ఉద్యోగాల భర్తీ కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను కంపెనీ ప్రతినిధులతో కలిసి బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ... కంటెంట్ మోడరైజేషన్, కస్టమర్ సర్వీస్ - వాయిస్ సపోర్ట్ విభాగాల్లో 1500 ఉద్యోగాలు ఉన్నట్టు వివరించారు. ఏదేని గ్రూప్‌లో బీటెక్ లేదా ఏదేని డిగ్రీ 2022, 2023, 2024 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఉద్యోగం హైదరాబాద్‌లో కల్పిస్తారని, యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు ముందుగా https://bit.ly/46Wzqz6 లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 28వ తేదీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ. రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకున్న అభ్యర్థుల అర్హతను పరిశీలించి వారిని ఇంటర్వ్యూకు అనుమతిస్తారు. ఎప్పుడు ఎక్కడ ఇంటర్వ్యూ జరుగుతుందనే వివరాలను రిజిస్ట్రేషన్ తరువాత తెలియజేస్తారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం తెలిపారు. ఇతర వివరాలకు 99888 53335 సెల్ నెంబరులో సంప్రదించవచ్చు. ఏడీఎస్డీ మురళీకృష్ణ, డీపీఓ గణేష్, కోఆర్డినేటర్లు దిలీప్, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా వృద్ధుల దినోత్సవం



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 21: రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ బాబూ రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై విశ్రాంత ఉపాధ్యాయుడు విద్వాన్ కస్పా పద్మనాభాన్ని సత్కరించారు.రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గోపీనాథ రెడ్డి, సింగంశెట్టి సుబ్బరామయ్య, సుబ్రహ్మణ్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 21: తిరుపతి రూరల్ సీఐగా సాదిక్ ఆలీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న అహ్మద్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 21: అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ఇసుక ట్రాక్టర్లను బుధవారం ఎస్ఈబీ అధికారులు సీజ్ చేశారు. సీఐ రామకిషోర్ తెలిపిన వివరాల మేరకు.. లీలామహల్ సమీపంలో వస్తున్న ట్రాక్టర్లను తిరుపతి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో అధికారులు తనిఖీ చేశారు. రెండు ట్రాక్టర్లకు కూడా బిల్లులు లేకపోవడంతో వీటిని అలిపిరి పోలీసులకు అప్పగించారు. డ్రైవర్లు రామిరెడ్డి, గురవయ్యను అరెస్టు చేశారు.

జెన్‌ప్యాక్ట్‌లో 1500 ఉద్యోగాలు : కలెక్టర్

తిరుపతి(విద్య), ఆగస్టు 21: ప్రముఖ ఐటీ కంపెనీ జెన్‌ప్యాక్ట్‌లో 1500 ఉద్యోగాలకు బీటెక్, డిగ్రీ ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. ఈ ఉద్యోగాల భర్తీ కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను కంపెనీ ప్రతినిధులతో కలిసి బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ... కంటెంట్ మోడరేషన్, కస్టమర్ సర్వీస్ - వాయిస్ సపోర్ట్ విభాగాల్లో 1500 ఉద్యోగాలు ఉన్నట్లు వివరించారు. ఏదైనా గ్రూప్‌లో బీటెక్ లేదా ఏదైనా డిగ్రీ 2022, 2023, 2024 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఉద్యోగం హైదరాబాద్‌లో కల్పిస్తారని, యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు ముందుగా జిల్లా/జేఏ/46/6 లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 28వ తేదీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ. రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకున్న అభ్యర్థుల అర్హతను పరిశీలించి వారిని ఇంటర్వ్యూకు అనుమతిస్తారు. ఎప్పుడు ఎక్కడ ఇంటర్వ్యూ జరుగుతుందనే వివరాలను రిజిస్ట్రేషన్ తరువాత తెలియజేస్తారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం తెలిపారు. ఇతర వివరాలకు 99888 53335 సెల్ నెంబరులో సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో ఏడీఎస్ మురళీకృష్ణ, డీపీఓ గణేష్, కౌశల్యెంద్ర దిలీప్, మహేష్ పాల్గొన్నారు.

సైన్స్‌పట్ల అవగాహన పెంచుకోండి

గూడూరు, ఆగస్టు 21: విద్యార్థి దశ నుంచే సైన్స్‌పట్ల అవగాహన పెంచుకోవాలని జేవీవీ పట్టణ అధ్యక్షుడు వి.రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం స్వర్ణాంధ్రభారతి కళాశాలలో జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మూఢనమ్మకాలపై పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. దొంగ స్వాములను నమ్మవద్దని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో నిరంజనరెడ్డి, నాగరాజు, రామ్మోహన్, ఆనంద్, సుబ్బారావు, రాధయ్య, సుమన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

24న కృష్ణాష్టమి వేడుకలు

గూడూరు, ఆగస్టు 21: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన పట్టణంలో నిర్వహించనున్న శ్రీకృష్ణజన్మదిన వేడుకలను, విశ్వహిందూ పరిషత్ స్థాపన దినోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వీహెచ్‌పీ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక వీహెచ్‌పీ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వహిందూపరిషత్ ఏర్పాటు చేసి 60 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఈనెల 24న నిర్వహించనున్న కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మురళీరెడ్డి, వెంకటరమణయ్య, ఆదిరాజు, ప్రతాంధ్రరెడ్డి, రాజగోపాలరెడ్డి, రామయ్య, రవిచంద్ర, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

గూడూరు/ వెంకటగిరి, ఆగస్టు 21: విద్యార్థినులు హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలని ఎన్ఐసీ సంస్థ అధ్యక్షుడు ధనుర్ద అన్నారు. డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో జరిగిన 'హెచ్ఐవీపై అవగాహన సదస్సు'లో ఆమె మాట్లాడుతూ నేటి యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా నైతిక విలువలను పాటించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, సంస్థ సభ్యులు దామోదర్, వెంకటేశ్వర్లు, శాంతి, కుజానీ తదితరులు పాల్గొన్నారు. వెంకటగిరి పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో నవజీవన్ ఆర్గనైజేషన్-నీసీ-టీం ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం నిహెచ్ఐవీ ఎల్‌టీ సుజాత్‌కుమార్ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ లక్షణాలు, అవి రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తదితరాలను వివరించారు. టోల్ ఫ్రీ నెం.1097ను సంప్రదిస్తే పూర్తి వివరాలు తెలుపుతారన్నారు. కె. బాలాజీ, కవిత, కల్పన, శిరీష, నళిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మెషిన్ వితరణ

గూడూరు అర్బన్, ఆగస్టు 21: స్థానిక ప్రగతి 'సేవా సంస్థ కార్యాలయంలో బుధవారం 'సేవాసంస్థ ఆధ్వర్యంలో మహిళకు కుట్టు మెషిన్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కే.చంద్రశేఖర్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన ఆపా అనే గిరిజన మహిళకు జీవనోపాధి కల్పించేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో కుట్టు మెషిన్ అందజేశామన్నారు. కార్యక్రమంలో మయూరి శ్యామ్‌యాదవ్, శ్రీనివాసులు, ప్రభాకర్, శివకుమారరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

గూడూరు అర్బన్, ఆగస్టు 21: స్థానిక వీరారెడ్డిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్నారులకు భోజనం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు తాజుద్దీన్, శ్రీనివాసులు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాశం

గూడూరు, ఆగస్టు 21: ప్రజలు అందజేసే సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పలువురు తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అందజేసే సమస్యలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేస్తున్నాన్నారు. ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ పరిధిలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటుచేస్తే తక్కువ ధరలకు అందుబాటులో వస్తుందని, దీంతో కార్మికులకు జీవనోపాధి దొరుకుతుందని చెప్పారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వారికి తెలిపారు.

న్యాయం చేయాలని

ప్రియుడి ఇంటిముందు యువతి ఆందోళన

గూడూరు, ఆగస్టు 21: ప్రేమించి మోసం చేశాడని తనకు న్యాయం చేయాలని ఓ యువతి బుధవారం ప్రియుడి ఇంటిముందు ఆందోళన చేపట్టిన సంఘటన గూడూరు ఆదుర్తిపాళెంలో చోటు చేసుకుంది. స్థానిక ఆదుర్తిపాళెంకు చెందిన ఓ యువతి అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి మోసం చేశాడని 'పేర్కొంది. ప్రస్తుతం వేరే యువతితో తాను ప్రేమించిన యువకుడు వివాహం చేసుకోవాలని చూస్తున్నాడని దీంతో తనకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగింది.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



విచారణ జరుపుతున్న డీఎస్పీ

పెళ్లకూరు, ఆగస్టు 21: మండలంలోని కానూరు రాజుపాళెం గిరిజనులపై శిరసనం బేదు రాజుపాళేనికి చెందిన రాజా ఇటీవల దాడి చేసిన ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ మేరకు బుధవారం నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు రెవెన్యూ అధికారులతో కలిసి కానూరు రాజుపాళెం గిరిజన కాలనీకి వెళ్లి బాధితులను విచారించారు. ఈ సందర్భంగా ఇటుక బట్టీల యజమాని తమను వేధించడంతో పాటు దాడికి పాల్పడి శ్రీనివాసులును నిర్బంధించిన విషయాన్ని డీఎస్పీకి తెలిపారు. అనంతరం నిర్బంధానికి గురైన శ్రీనివాసులును పిలిపించుకుని శిరసనంబేదు రాజుపాళెం వద్ద ఉన్న ఇటుక బట్టీల వద్దకు చేరుకున్నారు. అలాగే నిందితుడు రాజు ఇంటికి వెళ్లగా, ఆయన అందుబాటులో లేడని కుటుంబీకులు చెప్పారు. అనంతరం శ్రీనివాసులును నిర్బంధించిన స్థలాన్ని పరిశీలించారు. డీఎస్పీ వెంట ఆర్‌ఐ సంతోషమ్మ, వీఆర్వో సుమతి తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐ సురేష్‌బాబు బాధ్యతల స్వీకారం



చిల్లకూరు, ఆగస్టు 21: చిల్లకూరు ఎస్‌ఐగా బుధవారం సురేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ సురేష్‌కుమార్ వల్లారు జిల్లా దుర్గంకి బదిలీ అయ్యారు. దీంతో నెల్లూరు సైబర్ క్రైం విభాగంలో విధులు నిర్వహిస్తున్న సురేష్‌బాబు చిల్లకూరుకు బదిలీ కావడంతో బాధ్యతలు చేపట్టారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు లింగవరంలో
భూ సర్వే గ్రామసభ

చిల్లకూరు, ఆగస్టు 21: మండలంలోని లింగవరం సచివాలయంలో గురువారం 10గంటలకు తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో సర్వేచేసిన భూములకు సంబంధించి గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. గత నెల 24వ తేదీ నుంచి తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ, లింగవరం, పల్లిపాలిదిబ్బ, తీరపాలెం, తాళ్లదిబ్బ, గోసునుంచి గ్రామాల్లోని భూములను సర్వే చేశామన్నారు. గ్రామసభలో సాగుదారుల వివరాలను తెలియజేస్తామన్నారు. ఆయా గ్రామాల్లోని సాగుదారులు పాల్గొని వారి అభ్యంతరాలను తెలియజేయాలని తహసీల్దారు కోరారు.

ఊపందుకున్న భవన నిర్మాణ రంగం

● జోరుగా వివిధ భవనాల నిర్మాణం
● కూలీలకు చేతినిండా పని

సూళ్లూరుపేట, ఆగస్టు 21: గత వైసీపీ ప్రభుత్వ పాలనలో కుదేలైన భవన నిర్మాణ రంగం మళ్లీ ఊపందుకుంది. నిర్మాణ కార్మికులకు చేతి నిండా పని దొరుకుతోంది. గతంలో పీరంతా పనులు లేక పూట గడవని స్థితిలో అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తోంది. జూలై 8 నుంచి ఇసుకపై కొత్త విధానం అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి సూళ్లూరుపేట పట్టణంతో పాటు, మండలంలో భవన నిర్మాణాలు మొదలయ్యాయి. ఇతర నిర్మాణ పనులు జోరందుకున్నాయి. గతంలో సూళ్లూరు పేటతో పాటు మండలంలోని పలు గ్రామాలనుంచి నిర్మాణ కార్మికులు పనుల కోసం వేచి ఉండేవారు. చాలా మందికి పనులు దొరక్క నిరాశతో ఇళ్లకు తిరిగేవారు. ఇసుక సరిగ్గా దొరకక గృహ యజమానులు ఇబ్బంది పడేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్ ఇసుక రూ.6 వేలు ఉండేది. దీంతో చాలా మంది ఇసుక కొనుగోలు చేయలేక నిర్మాణాలను మధ్యలోనే ఆపేశారు. దీంతో నెల పొడవునా భవన నిర్మాణ కార్మికులకు నిక్కముంగా పని దొరికేది కాదు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక కొత్త విధానంతో ఆటు యజమానులు, ఇటు కార్మికులు సంతోషంగా ఉన్నారు. తాపీ మేస్త్రీలు, సెంట్రింగ్, ప్లంబర్, పెయింటింగ్, వడ్రంగి కూలీలకు ఇప్పుడు డిమాండ్ పెరిగింది. వారంతా ఉదయం లేచి పను లకు వెళ్లి నాలుగు డబ్బులు సంపాదించుకుంటున్నారు.





వినాయకుడి గుడి వద్ద పనులకు వచ్చిన భవన నిర్మాణ కూలీలు- భవన నిర్మాణ పనులు

వర్గీకరణ తీర్పును పునఃపరిశీలించాలి: మాల మహానాడు







గూడూరు టవర్‌క్లాక్ వద్ద, నాయుడుపేట అంబేడ్కర్ బొమ్మ సమీపంలో మాల మహానాడు నాయకుల ధర్నా - వెంకటగిరిలో మూతపడ్డ ఎస్బీఐ

గూడూరు, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును పునఃపరిశీలించేలా చర్యలు తీసుకోవాలని మాలమహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు సుమఖం వ్యక్తం చేస్తూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బుధవారం మాలమహానాడు పిలుపునిచ్చిన భారత్‌బంద్ పట్టణంలో పాక్షికంగా జరిగింది. పలు ప్రైవేటు పాఠశాలలు మండస్తూగా సెలవు ఇచ్చారు. టవర్ క్లాక్ సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మాలమహానాడు నాయకులు మాట్లాడుతూ... రాష్ట్రంలో మాలలు, మాదిగలు అన్నదమ్ములుగా కలిసిమెలిసి జీవిస్తున్న తరుణంలో ఎస్సీ వర్గీకరణ పేరుతో వారిని విడదీసేందుకు చేస్తున్న ప్రయత్నాలు సరైనవి కాదన్నారు. జి.శివకుమార్, ఆరవ పార్థయ్య, కె.శారదాకర, ఎస్.బాస్కర్ గౌడ్, బాబయ్య, హరి, చింతలబాబు తదితరులు పాల్గొన్నారు.

బంద్ పాక్షికం

వెంకటగిరి టౌన్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వెంకటగిరి పట్టణంలో మాల మహానాడు నిర్వహించిన బంద్ పాక్షికంగా జరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. దనంజయ, జాన్, సురేష్, పెంచలయ్య ఆంజనేయులు, రాజేష్, జయకర్, డేవిడ్, సుదాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీయులు నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అర్బన్ సీఐ బాబి నిబ్బందితో కలిసి భద్రత చేపట్టారు.

సూళ్లూరుపేట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును నిరసిస్తూ మాల మహానాడు జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడి నుంచి బజారు వీధుల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని డీటీ చైతన్యకి వినతిపత్రం అందజేశారు. చంద్రశేఖర్, చిన్న, కిషోర్, మునిరత్నం, చెంగయ్య, కుదిరి గోపి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రిజర్వేషన్ బచావో సంఘర్ష సమితి ఇచ్చిన పిలుపు మేరకు బంద్ చేపట్టారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మూత పడ్డాయి. అనంతరం కొత్తగుంట కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. బి.శీను, పి.వెంకటరమణ, ఎ.సురేష్, కె.రమేష్, మురళి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

హంతకులను బహిరంగంగా ఉరితీయాలి



కూటమి ఆధ్వర్యంలో జరిగిన నిరసన ర్యాలీ

కోట, ఆగస్టు 21: కోల్‌కతా నగరంలో వైద్య విద్యార్థినిని హత్యాచారం చేసిన నిందితులను బహిరంగంగా ఉరితీయాలని పలు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. మండల పరిధిలోని విద్యానగర్‌లో బుధవారం రాత్రి కూటమి ఆధ్వర్యంలో విద్యార్థులు, నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జనసేన నాయకులు నయాం, అల్లంశాను, టీడీపీ అధికార ప్రతినిధి డాక్టర్ టి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక ఇంజనీరింగ్ కళాశాల నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. గాంధీ బొమ్మకు వినతిపత్రం సమర్పించారు. నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు బాధితురాలి కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలంటూ డిమాండ్ చేశారు. అంతకుముందు కోటలోని ప్రగతి విద్యా సంస్థల విద్యార్థులతో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. పసుపులేటి కిషోర్ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

పుష్పిత్‌స్టీల్‌లో బిహార్ కార్మికుడి మృతి



మృతి చెందిన మహమ్మద్ అర్మాన్

ఏర్పేడు, ఆగస్టు 21: ఏర్పేడు మండలం మేర్లపాక వద్ద ఉన్న పుష్పిత్‌స్టీల్ కర్మాగారంలో బిహార్‌కు చెందిన కార్మికుడు మృతి చెందాడు. బిహార్ రాష్ట్రం అరారియా జిల్లా రాంగార్ పంచాయతీకి చెందిన మహమ్మద్ అర్మాన్(22) రెండేళ్ల క్రితం పుష్పిత్‌స్టీల్స్ కర్మాగారంలో పనిచేయడానికి వచ్చాడు. కర్మాగార ఆవరణలో ఉన్న క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి 10 గంటలకు విధులకు వెళ్లాడు. బుధవారం ఉదయం 6 గంటలకు డ్యూటీ నుంచి రూమ్‌కు రావాల్సిన మహమ్మద్ అర్మాన్ 9 గంటలైనా రాకపోవడంతో తోటి కార్మికులు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ పనిచేస్తున్న అధికారులు కర్మాగారంలో వెతికి చూడగా కర్మాగారం లోపల గాలించగా వాటర్‌కూలింగ్ కంప్లెక్స్‌లో పడి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మహమ్మద్ అర్మాన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొరియర్ కార్యాలయంలో మంటలు



నాయుడుపేట టౌన్, ఆగస్టు 21: పట్టణంలోని భరత్‌నగర్‌లో కొరియర్ కార్యాలయంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికుల కథనం మేరకు.. కొరియర్ కార్యాలయాన్ని బుధవారం రాత్రి ఎప్పటిలాగే నిర్వాహకులు మూసివేసి ఇంటికి వెళ్లారు. కొంత సమయం తరువాత కార్యాలయం నుంచి మంటలు చెలరేగుతుండటంతో పరిసర ప్రాంతాల వారు గుర్తించి పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సుమారుగా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే కొరియర్ కార్యాలయంలో ఉన్న సామగ్రి దగ్ధమైంది.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం

కోట, ఆగస్టు 21: ప్రతిభా పాటవాలు కలిగి చదువుకోవాలన్న తపన ఉన్న ప్రతి పేద విద్యార్థికి అండగా ఉంటామని శ్రీ పీర్ సాయి ఆర్య సేవా సమితి అధ్యక్షుడు రమణయ్య చెప్పారు. కోటలోని సమితి కార్యాలయంలో బుధవారం చిట్టమూరు మండలం మెట్టు గ్రామానికి చెందిన డి.సౌమ్యకు రూ.10 వేల చెక్కును అందజేశారు. సౌమ్యకు ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ సీట్ వచ్చింది. ఈక్రమంలో తనకు బిల్డింగ్, వ్యాన్ పీజులు చెల్లించాలంటూ సౌమ్య సమితిని ఆశ్రయించింది. ట్రస్టు ప్రతినిధులు వెంకటరమణారెడ్డి, నాగరాజరెడ్డి తదితరులు ఉన్నారు.

గురుకులాలలో అధికారుల బృందం

కోట, ఆగస్టు 21: మండలంలోని చిట్టేడు యానాదుల గురుకుల జూనియర్ కళాశాల, పాఠశాలలను బుధవారం అధికార బృందం సందర్శించింది. ఎంపీడీవో భవానీ, ఎంపీపీ అంజమ్మ పలువురు వైద్యాధికారులు వసతులను పరిశీలించారు. అదే విధంగా పారిశుధ్యాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల భోజనాలు, నీటిని పరిశీలించారు. ఆయా పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్లతో పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయంతో భూములకు జీవం

వెంకటగిరి టౌన్, ఆగస్టు 21: ప్రకృతి వ్యవసాయంలో భూములకు జీవం వస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ వనరుల కేంద్రం ఏడీఏ బి.సుబ్బయ్య అన్నారు. బుధవారం కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచక్షణ రహితంగా రసాయన ఎరువుల వినియోగంతో భూముల సారం కోల్పోతున్నాయని చెప్పారు. దీని ప్రత్యామ్నాయంగా ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని కోరారు. ఉద్యానవన పంటలపై దృష్టి పెడితే అధిక దిగుబడులు సాధించి లాభసాటిగా ఉంటుందన్నారు.

గందరగోళం నడుమ

కోస్టల్ కారిడార్ భూముల తీర్మానం



గ్రామసభలో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

కోట, ఆగస్టు 21: చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్‌లో భూముల కోల్పోయే రైతులకు పరిహారం చెల్లించే విషయంలో అప్పటి వైసీపీ నాయకులు బినామీలను రైతులుగా చేర్చారని తక్షణం వాటిపై దృష్టి సారించాలంటూ టీడీపీ నాయకులు పట్టుబట్టారు. కోట మండలం కొత్తపట్నం సచివాలయంలో బుధవారం చెన్నై, బెంగళూరు కోస్టల్ కారిడార్ కోసం సేకరించిన 444 ఎకరాలకు సంబంధించి అభ్యంతరాలపై గ్రామసభ నిర్వహించారు. తహసీల్దారు జయలక్ష్మిరావు, డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున రావు, మండల సర్వేయర్ రామకుమార్ ఆధ్వర్యంలో ఈ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామసభలో టీడీపీ, వైసీపీ మద్దతుదారులైన రైతుల మధ్య వాగ్వాదం జరిగింది. ఒక వర్గం రైతులు న్యాయం చేయాలని పట్టుబట్టగా మరో వర్గం పరిహారులను వ్యతిరేకిస్తూనాయి రైతులు ఆందోళన చేశారు. ఆకు తరువాత అధికారుల జోక్యంతో రెండు వర్గాల రైతులు గ్రామసభలో అభ్యంతరాలు లేవని చెప్పడంతో అధికారులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో శేషుబాబు, శ్రీనివాసులు, రమణయ్య, సుబ్రహ్మణ్యం, పలువురు మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.4,30,988



నాయుడుపేట టౌన్, ఆగస్టు 21: పట్టణంలోని గడియారంసెంటర్ వద్ద కొలువై ఉన్న గ్రామ దేవత పోలేరమ్మ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. రెండు నెలల 22 రోజులకు గాను రూ. 4,30,988 వచ్చినట్లు ఈవో శశాంక్ తెలిపారు. అలాగే అమ్మవారి చీరల వేలం ద్వారా రూ. 6,301 వచ్చినట్లు ఆయన తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు



చిల్లకూరు, ఆగస్టు 21: మండలంలోని కొట్టక్కా రోడ్డు సమీపంలో బుధవారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని రెట్టపల్లికి చెందిన చెంగయ్య, కోటేశ్వరరావు బైక్‌పై కడివేడు నుంచి గ్రామానికి వెళుతూ కోట క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో నాయుడుపేట నుంచి నెల్లూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో బైక్‌పై వెళుతున్న ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కోటేశ్వరరావును మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

చిల్లకూరు, ఆగస్టు 21: రాజే పడకుండా నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించాలని తహసీల్దారు శ్రీనివాసులు చెప్పారు. బుధవారం స్థానిక డానియల్ చిల్డ్రన్ హోంలోని వంటగది, మరుగుదొడ్డు, వసతి గదులను ఎంతవో రఘునాథ్ కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... హోంలోని పిల్లలకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలన్నారు. మరుగుదొడ్డు, వంటగది, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ రమణయ్య, వాసుదేవయ్య తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్ రిజర్వేషన్ కౌంటర్‌ను

అందుబాటులోకి తీసుకురండి

గూడూరు, ఆగస్టు 21: స్థానిక రైల్వేస్టేషన్‌లో పడమర వైపు నిర్మించి ఉన్న రిజర్వేషన్ కౌంటర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మాజీ ఎంపీ వరప్రసాద్ రావు కోరారు. బుధవారం విజయవాడలోని రైల్వే డీఆర్ఎం నరేంద్రపాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ... రైల్వేస్టేషన్‌కు పడమరవైపు రెండో పట్టణ ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా రిజర్వేషన్ కౌంటర్ నిర్మించారన్నారు. అప్పటి నుంచి కౌంటర్‌ను ప్రారంభించలేదన్నారు. అదే విధంగా గూడూరు ఒకటి, రెండో పట్టణానికి రాకపోకలు సాగించేందుకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయించడానికి కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

ఉపాధ్యాయనగర్ కాలనీలో పార్కు

ఎమ్మెల్యే కురుగొండ్ల



9వ వార్డులో ఆక్రమణలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వెంకటగిరి, ఆగస్టు 21: పట్టణంలోని ఉపాధ్యాయనగర్ కాలనీవాసులకు ఆహ్లాదకరమైన పార్కును త్వరలో అందుబాటులో తీసుకువస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం చెవిరెడ్డిపల్లి చెరువు సహా ప్రభుత్వ భూముల ఆక్రమణలను పరిశీలించారు. చెవిరెడ్డిపల్లి చెరువు ఆక్రమణలను తొలగించాలని ఆయన ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమణలు ప్రభుత్వ భూములను కబ్జా చేశారని వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేడీకే ప్రసాద్ నాయుడు, పి.వెంకటేశ్వరరావు, వి.రాజేశ్వరరావు, కె.శ్రీనివాసులు నాయుడు, ఎ.సత్యనారాయణ, బాబునాయుడు, మల్లాం బాబు, తహసీల్దార్ మునిలక్ష్మి తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

శ్మశానాన్ని ఆక్రమిస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో

చిల్లకూరు, ఆగస్టు 21: శ్మశానాన్ని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో కిరణ్‌కుమార్ ఆన్నారు. బుధవారం చిల్లకూరు పట్టణంలోని సర్వే నెం.107లో శ్మశానాన్ని ఆయన పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నెం.107లో 8.60 ఎకరాల్లో శ్మశానం ఉందన్నారు. ఈ భూమి కొంతమేర ఆక్రమణకు గురైనట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో శ్మశానాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశామన్నారు. ఆయన వెంట తహసీల్దారు శ్రీనివాసులు, వీఆర్‌ఓ రమణయ్య, సర్వేయర్ తరుణ్ తదితరులు ఉన్నారు.

షార్ విశ్రాంత ఉద్యోగులకు సన్మానం



సన్మాన గ్రహీతలతో సీఐ మురళీకృష్ణ

సూళ్లూరుపేట, ఆగస్టు 21: పట్టణంలోని డీఆర్‌డీఎస్ షార్ కాలనీ క్లబ్ ఆవరణలో బుధవారం వరల్డ్ సీనియర్ సిటిజన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ రిటైర్డ్ షార్ ఉద్యోగులు పాల్గొన్నారు. వీరిలో 75 సంవత్సరాలు నిండిన 20 మంది షార్ విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. ముఖ్య అతిథిగా సీఐ మురళీ కృష్ణ విచ్చేసి సీనియర్ సిటిజన్లు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కుమారస్వామి, ఆదిశేషారెడ్డి, ప్రేమనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి



సదస్సులో సూచనలిస్తున్న అదనపు న్యాయమూర్తి అనూష

సూళ్లూరుపేట, ఆగస్టు 21: మాదక ద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూళ్లూరుపేట సివిల్ జడ్జికోర్టు అదనపు న్యాయమూర్తి ఎస్.అనూష యువతకు సూచించారు. బుధవారం స్థానిక వీఎస్ ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లను అలవర్చుకుంటే భవిష్యత్తులో అనుకున్నది సులువుగా సాధించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎల్.వి.శంకర్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ విజయరాణి, ఆధ్యాపకులు ఉమారాణి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

దక్కిలి, ఆగస్టు 21: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు గూడూరులో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ప్రసన్న కుమారి తెలిపారు. ఈ మేరకు క్రీడల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు బుధవారం క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎప్పుడూ విధి నిర్వహణలో తలమునకలై ఉండే ఉపాధ్యాయులు అప్పుడప్పుడూ ఇలా క్రీడాపోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. క్రీడల వల్ల మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. ఎంఆర్వీలు జగదీష్ బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

60 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



తడ, ఆగస్టు 21: రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారంటూ పోలీసులకు సమాచారం అందింది. సోమవారం రాత్రి ఆక్కంపేట జాతీయ రహదారి వద్ద లగేజీ ఆటోలో బియ్యం తరలి వెళ్తుండగా గుర్తించి పట్టుకున్నారు. డ్రైవర్‌ను, వాహనాన్ని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అందులో తనిఖీ చేయగా సుమారు రూ.1.10 లక్షలు విలువైన 60 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లుగా గుర్తించారు. ఈ మేరకు బియ్యాన్ని గోడౌనుకు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేంద్రబాబు తెలిపారు.

భూ ఆక్రమణ అడ్డగింత

తడ, ఆగస్టు 21: కోర్టు పరిధిలో ఉన్న భూ ఆక్రమణకు యత్నించగా అడ్డుకున్నామని తహసీల్దార్ శరత్‌బాబు తెలిపారు. తడకండ్రిగ పంచాయతీ సర్వే నెం.89/5లో సుమారు 1.97 ఎకరాల ప్రభుత్వ భూమిపై సర్వే సెటిల్‌మెంట్ కోర్టులో కేసు నడుస్తోంది. మంగళవారం కొందరు ఆ భూమిని చదును చేయిస్తుండగా అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు బుధవారం భూమిని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

మండలాభివృద్ధికి కలిసి పనిచేద్దాం: ఆదిమూలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, ఆగస్టు 21: మండలాభివృద్ధికి అందరూ కలిసి పనిచేద్దామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అరణియార్ ఆధునికీకరణ పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. అలాగే తుడా నిధులతో చేపడుతున్న టూరిజం పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. మండలంలో ఇల్లు లేని పేదలను గుర్తించి వారికి ఇంటి స్థలం కేటాయించాలని తహసీల్దార్‌ను ఎమ్మెల్యే కోరారు. మండలంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, ప్రజా ఆరోగ్యం వంటి మౌలిక వసతులు మెరుగుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం ప్రారంభమైనందున పారిశుధ్యంపై స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. అనంతరం శాఖల వారీగా ప్రగతి నివేదికను అధికారులు సభలో చదివి వినిపించారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు విష్ణుప్రియ, వైస్ ఎంపీపీ విజయమ్మ, ఎంపీడీవో రాధారాణి, తహసీల్దార్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

బాబు పాలనలో పారిశ్రామికాభివృద్ధి పరుగులు

వరదయ్యపాళెం, ఆగస్టు 21: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనతో పారిశ్రామికాభివృద్ధి పరుగులు పెడుతోందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. వరదయ్యపాళెం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న రెండు నెలల్లోనే శ్రీసిటీని సందర్శించారన్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డితో గంట పాటు చర్చించి అక్కడ ఉన్న పరిశ్రమల స్థితిగతులు, ఉపాధి అవకాశాలపై సమీక్షించారని తెలిపారు. గత ప్రభుత్వం స్థానికులకు 75శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వ విధానాలతో పలు పరిశ్రమలు తరలి పోయిన ఘటనలు కూడా ఉన్నాయన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఇక మండలంలో సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఈవోపీఆర్డీ చిరంజీవి, టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, నాగరాజు యాదవ్, కరుణాకర్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, నందకిషోర్‌రెడ్డి, రవిరెడ్డి, సురేష్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బాషా, బీజేపీ నాయకులు డిల్లీ ప్రకాష్, బాలరాజు, కెనడీ తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా నీలకంఠేశ్వరుడి కల్యాణోత్సవం





పట్టువస్త్రాలను తీసుకువెళుతున్న అధికారులు - ప్రత్యేక అలంకారంలో అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి

శ్రీకాళహస్తి, ఆగస్టు 21: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరు గ్రామంలో వెలసిన అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం బుధవారం ఆగమోక్తంగా జరిగింది. ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికలో స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి స్వామి అమ్మవార్లకు ఆలయ అధికారులు పట్టువస్త్రాలను సమర్పించారు.

చిరంజీవికి ఘన స్వాగతం



చిరంజీవికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

రేణిగుంట, ఆగస్టు 21: ప్రముఖ సినీ హీరో చిరంజీవికి ఘన స్వాగతం లభించింది. గురువారం చిరంజీవి జన్మదినం సందర్భంగా శ్రీవారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదు నుంచి ప్రత్యేక విమానంలో బుధవారం సాయంత్రం 6.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షుడు డాక్టర్ హరిప్రసాద్, తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి, చిరంజీవి అభిమాన సంఘం నాయకులు బుజ్జి, కార్పొరేటర్ నరసింహాచారి స్వాగతం పలికారు. అనంతరం చిరంజీవి రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

గంగమ్మ త్రిశూల ప్రతిష్ఠాపన

వరదయ్యపాళెం, ఆగస్టు 21: వరదయ్యపాళెంలోని చెంగాలమ్మ పరమేశ్వరి తిరునాళ్లలో భాగంగా బుధవారం గంగమ్మకు సామూహిక పొంగళ్లు పెట్టారు. గంగమిట్ట వీధిలో వెలసిన గంగమ్మకు దేవాంగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొప్పల తిలక్ ఆధ్వర్యంలో బుధవారం దాతల సాయంతో శాస్త్రోక్తంగా త్రిశూలాన్ని ప్రతిష్ఠించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మ వారికి మొక్కులు చెల్లించుకున్నారు.



త్రిశూలాన్ని ప్రతిష్టిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి

సత్యవేడు

డీఎస్పీగా నరసింహమూర్తి



శ్రీకాళహస్తి, ఆగస్టు 21: శ్రీకాళహస్తి డీఎస్పీగా నరసింహమూర్తి నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ పోలీసుశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా నగరి డీఎస్పీ నరసింహమూర్తిని శ్రీకాళహస్తికి బదిలీ చేశారు.

టూటౌన్ సీఐగా వెంకటేశ్వర్లు



శ్రీకాళహస్తి, ఆగస్టు 21: శ్రీకాళహస్తి టూటౌన్ సీఐగా వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తిరుపతి సీసీఎస్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకారం



బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 21: బుచ్చినాయుడు కండ్రిగ ఎస్‌ఐగా విశ్వనాథ నాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ వెంకట నరసింహ వీఆర్‌కు బదిలీ అయ్యారు.

ఎస్టీల భూములపై వైసీపీ నేత కన్ను

అధికారుల అండతో వెబ్‌లాండ్‌లో మార్పులు ● పంట రుణం కోసం వన్ బీ తీసుకోవడంతో వెలుగులోకి







బి.సుదర్శన్‌రెడ్డి, బి.పుట్టారెడ్డి పేర్లతో ఉన్న వన్ బీ - ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను చూపుతున్న ఎస్టీలు

ఏర్పేడు, ఆగస్టు 21: పేదల జీవనాధారం కోసం మూడు దశాబ్దాల కిందట ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ బలం, అధికారుల అండదండలతో ఆన్‌లైన్‌లో తమ పేర్లతో వైసీపీ నేతలు మార్చుకున్నారు. ఏర్పేడు మండలం ముసలిపేడు పంచాయతీలో ఎస్టీ(ఎరుకుల) కులానికి చెందిన దాసా సుబ్బమ్మ పేరుతో సర్వే నెంబరు 398/1ఏ, 1బిలో 2 ఎకరాలు, మెండ్రగుత్తి నాగమ్మ పేరుతో సర్వే నెంబరు 398/2ఏ, 2బిలో రెండు ఎకరాలు, మెండ్రగుత్తి జయమ్మ పేరుతో సర్వే నెంబరు 398/2సి, డిలో 2 ఎకరాలు, దాసా కాంతమ్మ పేరుతో సర్వే నెంబరు 398/1సి, 1డిలో రెండు ఎకరాలు. మొత్తంగా నలుగురు రైతులకు ఒక్కొక్కరికి రెండు ఎకరాలు చొప్పున 8 ఎకరాల భూమిని 30ఏళ్ల కిందట అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి నుంచి ఎస్టీలు ఆ భూమిని సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం నాలుగెకరాల్లో మామిడిచెట్లు, నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. నలుగురు రైతులకూ వారి భూముల్లో బోర్లు కూడా ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 9వ తేదీ వరకు వారి పేరుతోనే వెబ్‌ల్యాండ్‌లో వన్‌బీ రికార్డు ఉంది. జనవరిలో ఏర్పేడు తహసీల్దారుగా పనిచేసిన శివప్రసాద్ సంతకంతో శ్రీకాళహస్తి మండలానికి చెందిన వైసీపీ కీలక నేత తమ కుటుంబీకుల పేర్లతో ఆన్‌లైన్ చేసుకుని రికార్డులు మార్చుకున్నాడు. ప్రస్తుతం వైసీపీ కీలకనేత బంధువులైన బి.పుట్టారెడ్డి పేరుతో 398/2ఏ, 2బి, 2సి, 2డి సర్వే నెంబర్లకు సంబంధించి నాలుగు ఎకరాలు. బి.సుదర్శన్‌రెడ్డి పేరుతో 398/1ఏ, 1బి, 1సి, 1డి సర్వే నెంబర్లలో 4 ఎకరాలు ఆన్‌లైన్‌లో నమోదై ఉంది. బ్యాంకులో పంట రుణం పొందడానికి ఎస్టీలు వన్‌బీ తీసుకోగా తమ భూములు ఇతరుల పేరుమీద ఉండడంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. రూ.2కోట్లు చేసే భూములను కబ్జా చేయడానికి వైసీపీ నేత పథకం ప్రకారం వన్‌బీలో మార్పులు చేయించుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై తహసీల్దారు భార్గవిని వివరణ కోరగా పరిశీలించి బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని, అలాగే ఆన్‌లైన్‌లో అవకతవకలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సత్యవేడు పార్కుకు మహర్దశ



పార్కులో జరుగుతున్న పనులు

సత్యవేడు, ఆగస్టు 21: సత్యవేడు పార్కుకు మహర్దశ పట్టనుంది. పార్కు పునర్నిర్మాణానికి తుడా ముందుకొచ్చింది. పట్టణంలోని సత్యవేడు - ఊత్తుకోట మార్గంలో నాలుగు దశాబ్దాల క్రితం ప్రజలకు ఆహ్లాదం అందించడానికి పార్కును నిర్మించారు. అనంతర కాలంలో పార్కు పక్కనే తెలుగుగంగ కాలువ నిర్మాణం జరగడంతో పార్కు శిథిలమయింది. అప్పటినుంచి సత్యవేడులో పార్కును పునర్నిర్మించాలని ప్రజాప్రతినిధులను పట్టణ వాసులు అభ్యర్థిస్తూ వచ్చారు. ఒక దశలో పార్కును పునర్నిర్మించేందుకు శ్రీసిటీ యాజమాన్యం ముందుకొచ్చినా కొన్ని అనివార్య కారణాలతో కార్యరూపం దాల్చలేదు. 2017లో టీడీపీ హయాంలో పార్కు పునర్నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ పడింది. అప్పటి ఎమ్మెల్యే తలారి ఆదిత్య చొరవతో రూ.10 లక్షలు ఉపాధి నిధులను మంజూరు చేయించారు. శిథిలమైన పార్కు పక్కనే మరో కొత్త పార్కును నిర్మించారు. 2019లో పార్కు పనులు పూర్తికాగా ప్రారంభ సమయంలో ఎన్నిలు రావడంతో వాయిదా పడింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పార్కు గురించి పట్టించుకోలేదు. ఐదేళ్లగా ప్రారంభం కాకపోవడంతో పార్కు లోపల పిచ్చిచెట్లు మొలిచి పార్కు అందవిహీనంగా మారిపోయింది. దీనిపై పత్రికల్లో పలుమార్లు కథనాలు ప్రచురితం కావడంతో స్పందించిన ఎమ్మెల్యే ఆదిమూలం ఇటీవల పార్కు పునర్నిర్మాణానికి సంబంధించి తుడా పాలకమండలిని సంప్రదించారు. పార్కును సుందరీకరణ చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని వారిని కోరారు. గత వారం తుడా అధికారులు పార్కును పరిశీలించి, పార్కు పునర్నిర్మాణానికి సానుకూలంగా స్పందించారు. బుధవారం పార్కు సుందరీకరణ పనులు మొదలయ్యాయి. తుడా ఉద్యానవన అధికారిణి మాలతీ, సహాయ ఉద్యానవన అధికారి సుబ్రహ్మణ్యంరెడ్డి పార్కుకు చేరుకుని ఎంపీడీవో చంద్రశేఖర్, సెక్రటరీ రవికుమార్ ఆధ్వర్యంలో పార్కు డిజైన్‌కు అనుగుణంగా పార్కులో అడ్డదిడ్డంగా పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించే పని చేపట్టారు. జంగిల్ క్లియర్ పనుల అనంతరం పార్కులో ఏర్పాటు చేయనున్నవాకర్స్ ట్రాక్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, మొక్కల పెంపకం తదితర అవసరమైన నిధులకోసం అంచనాలను తుడా అధికారులకు పంపి, పదిరోజుల్లో పార్కు పనులను పూర్తి చేస్తామని తెలిపారు. కాగా, సత్యవేడు పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆదిమూలం పరిశీలించారు. బుధవారం సాయంత్రం పార్కుకు చేరుకుని తుడా ఉద్యావన అధికారులతో మాట్లాడి వివరాలడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఐ మురళి, ఎస్‌ఐ వీరాంజనేయులు, ఎంపీడీవో చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, నాయకులు పరమశివం, చిన్న, బాల, శశి, ప్రభాకర్‌రెడ్డి, అమాసరెడ్డి, కొండూరు బాలరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

శ్రీకాళహస్తి, ఆగస్టు 21: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 70రోజులు దాటినా ఇంకా సూపర్‌సిక్స్ పథకాలు మొదలు పెట్టలేదన్నారు. యువతకు నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి, తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికీ రూ.15వేలు, రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20వేల ఆర్థిక సాయం, ప్రతి మహిళకు నెలకు రూ.1,500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ బత్తెయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ



రామచంద్రయ్యను పరామర్శిస్తున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, ఆగస్టు 21: పట్టణంలోని కొత్తపేటలో నివాసం ఉంటున్న మాజీ కౌన్సిలర్ పుష్పమ్మ భర్త, టీడీపీ నాయకుడు రామచంద్రయ్య మెట్లపై జారిపడి గాయపడ్డారు. చెన్నైలో చికిత్స పొందిన ఆయన ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ బుధవారం రామచంద్రయ్య నివాసానికి చేరుకుని ఆయనను పరామర్శించారు. ఆమె వెంట టీడీపీ నాయకులు రాంబాబు నాయుడు, రేణుకాదేవి, మల్లీశ్వరి తదితరులు ఉన్నారు.

టీడీపీ నేత కుటుంబానికి పరామర్శ

కేవీబీపురం, ఆగస్టు 21: టీడీపీ నేత, మాజీ వైస్ ఎంపీపీ కిరణ్ యాదవ్‌ను సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పరామర్శించారు. కిరణ్ యాదవ్ కుమారుడు యోగేష్ ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం జరిగిన కర్మక్రియలకు టీడీపీ నాయకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. యోగేష్ చిత్రపటానికి నివాళులర్పించి కిరణ్ యాదవ్, అతని కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ తలారి మనోహర్, మాజీ ఎమ్మెల్యేలు హేమలత, ఎస్సీవీ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు, నాయకులు నరసింహ యాదవ్, గురవారెడ్డి, చెంచయ్యనాయుడు, రామాంజులు నాయుడు, గోపీనాథ్‌రెడ్డి, మునస్వామి యాదవ్, సర్పంచులు సురేష్, దొరబాబు నాయుడు, ప్రకాష్ యాదవ్, బాలాజీ, సురేష్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

పాడిపరిశ్రమతో రైతులు అభివృద్ధి చెందాలి

కేవీబీపురం, ఆగస్ట 21: పాడిపరిశ్రమతో రైతులు అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. బుధవారం మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచు దొరబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు పంచాయతీల్లో గ్రామసభలు

సత్యవేడు, ఆగస్టు 21: సత్యవేడు మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈనెల 23వ తేదీ శుక్రవారం ఉపాధి హామీ పథకంలో పనులను గుర్తింపు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు సంబంధిత పంచాయతీల సెక్రటరీలు ఆయా సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. సంబంధిత గ్రామ కార్యదర్శులు గ్రామాల్లో ముందుగా దండోరా వేసి సభలకు ప్రజలు తరలివచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

సంక్షేమానికి పెద్దపీట

ఏర్పేడు, ఆగస్టు 21: రాష్ట్రంలో సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్దపీట వేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని 9వ క్లస్టర్ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్థానిక సంస్థల అభివృద్ధికి రూ.1,452 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పొన్నారావు, నాగేశ్వరరావు, కృష్ణవేణి, కేకే.రమణ, మునెయ్య, గుణయాదవ్, సదాశంకర్, బాలాజీ, కేవీ రమణ, బాలాజీ యాదవ్, గోల్‌మాన్ నాయుడు, నారాయణశెట్టి పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల హాస్టల్ తనిఖీ

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 21: మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో సాయిలహరి, ఎంఈవో రవీంద్రనాథ్ బుధవారం తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలు, మరుగుదొడ్లు, వంట గది, విద్యార్థులకు పెడుతున్న భోజనంపై ఆరా తీశారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని వార్డన్ సుభాషిణిని ఆదేశించారు.

సీబీఎస్ఈ పరీక్షల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 21: మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్ ద్వారా జరిగిన ఆన్‌లైన్ సీబీఎస్ఈ పరీక్షలను ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం బుధవారం పరిశీలించారు.

వర్గీకరణతో ఎస్సీల మధ్య చిచ్చు



శ్రీకాళహస్తిలో జైభీమ్ ఆర్మీ సంస్థ నాయకులు, విద్యార్థుల మానవ హారం

శ్రీకాళహస్తి, ఆగస్టు 21: ఎస్సీలను వర్గీకరణతో మాల, మాదిగలను మధ్య చిచ్చు రేపడం సరికాదని జైభీమ్ ఆర్మీ, అంబేడ్కర్ మిషన్ నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ శ్రీకాళహస్తిలో బుధవారం జరిగిన బంద్ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద జైభీమ్ ఆర్మీ, అంబేడ్కర్ మిషన్ ఆధ్వర్యంలో వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జైభీమ్ ఆర్మీ సంస్థ నాయకుడు పులి శ్రీకాంత్, కూలి రవికుమార్, సైమన్ శ్రీనివాస్, పోతల చంద్ర, పెరిమిడి రఘు, బావులూరి అంకయ్య, అక్కుర్తి శివ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: అన్నదమ్ముల్లా ఉన్న ఎస్సీలను వర్గీకరణ పేరుతో విభజించడం అన్యాయమని అంబేడ్కర్ నేషనల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బాలగురవం భరణి బాస్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం వరదయ్యపాళెం బస్టాండు వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో శంకర్, మురళి, బాబు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పాపానాయుడుపేటలో అంబేడ్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్ స్టార్ కృష్ణ, ఏర్పేడులో అంబేడ్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షులు శంకరయ్య ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. దళిత నాయకులు గురవమ్మ, శంకరయ్య, ఈశ్వరయ్య, మధు, హరి, జయ, నరేష్, రామయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: మండలంలోని అంబేడ్కర్ సంఘ నాయకులు ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా బంద్ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు కరణం పల్లజ, జనసేన నాయకుడు థామస్, మురగయ్య, రవి, కళత్తూరు నాయకులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు





శివసాయినగర్‌లో సీసీ రోడ్డు లేని దారి, డ్రైనేజీ లేక నిలిచిన మురుగు

పన్నులు సరే... వసతులు ఏవి?

పుత్తూరు టౌన్, ఆగస్టు 21: పుత్తూరు మున్సిపాలిటీకి ఏటా కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా ప్రజలకు మౌలిక వసుతులు కల్పించడంలో పాలకవర్గం విఫలమవుతోంది. ఇంటి పన్నులు, గ్రంథాలయ పన్నులు, వీధి దీపాలు, నీటి కొళాయిల పన్నులు వెరసి ప్రతి సంవత్సరం దాదాపు పన్నుల రూపేణా రెండు కోట్ల రూపాయలు ఆదాయం వస్తుంది. దీనికి తోడు 14, 15 ఆర్థిక సంఘ నిధులు దాదాపు 4 కోట్లు మంజూరు అయ్యాయి. అయినా పట్టణంలోని పలు వార్డుల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా అన్ని వార్డుల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పుత్తూరు, ఆగస్టు 21: పుత్తూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గణితం, బోటనీ సబ్జెక్టుల్లో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రఘుపతి తెలిపారు. పీజీలో 50 శాతం ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులు అర్హులని, మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత వుంటుంద న్నారు. ఆసక్తి ఉన్నవారు సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని కోరారు.

ప్రజలతో నాయకులు సత్సంబంధాలు పెంచుకోవాలి: భానుప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

వడమాలపేట, ఆగస్టు 21: ప్రజలతో నాయకులు సత్సంబంధాలు పెంచుకొని సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. బుధవారం వడమాలపేట మండల టీడీపీ నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేసి ఆరువేల పైచిలుకు మెజారిటీతో తనను గెలిపించారని కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో సమస్యలపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి ఉన్న తాధికారులకు తెలియజేసి పరిష్కరింపజేస్తామని చెప్పారు. నాయకులు, కార్యకర్తలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని, భవిష్యత్తులో టీడీపీ బలోపేతం కోసం అందరం కలిసి కట్టుగా కృషి చేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో మోసపోయిన, ఇబ్బందులు పడిన నాయకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అన్నింటినీ సమగ్రంగా సమీక్షించి పరిష్కరిస్తానని చెప్పారు. సమావేశంలో చినబాబు, ధనంజయులు నాయుడు, వెంకటయ్య, సుబ్రహ్మణ్యంరెడ్డి, మునిరత్నం, మురళీధర్‌రెడ్డి, సత్యనారాయణ, పెద్దబ్బరాజు, లక్ష్మీ ప్రసన్న, ఉమాపతి రావ్, హేమావతి, మునిశేఖర్, వెంకటేశ్వరరావ్, దాము యాదవ్, సుబ్రహ్మణ్యంయాదవ్, గణపతి, రఘు, శివరాజు, హేమాద్రి, సురేష్‌రాజు, మునిరెడ్డి, తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాలీడ్ వేస్టు మేనేజ్మెంట్‌పై శిక్షణ



వడమాలపేట, ఆగస్టు 21: వడమాలపేట మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సాలీడ్ వేస్టు మేనేజ్మెంట్‌పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సాలీడ్ వేస్టు మేనేజ్మెంట్ షెడ్‌ను సందర్శించి ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తి, ఈవోపీఆర్‌డీ మాధురి, సుదర్శిని, శిక్షణ అధికారులు, ఎంపీటీలు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రేణిగుంట మీదుగా నగరికి అదనపు బస్సు సర్వీసు నడపాలి

పుత్తూరు, ఆగస్టు 21: రేణిగుంట మీదుగా ఒక్క ఆర్టీసీ బస్సు సర్వీసును మాత్రమే నడుస్తుండడంతో పుత్తూరు, నగరి ప్రాంతాల నుంచి వెళ్లే రైల్వే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. పుత్తూరు డిపో నుంచి 52 సర్వీసులు తిరుపతికి బైపాస్ మీదుగా వెళుతున్నాయి. ఇందులో 15 పల్లె వెలుగు సర్వీసులు వున్నాయి. అయితే ఒక్క సర్వీసును మాత్రమే రేణిగుంట మీదుగా నడపడంతో కేఎల్ఎం ఆసుపత్రి కూడలి వద్ద దిగి ఆటోలో ప్రయాణించాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేణిగుంట మీదుగా అదనంగా మరొక పల్లెవెలుగు సర్వీసు నడపాలని కోరుతున్నారు.